

www.vibharenews.com

# విభారె

తెలుగు దినపత్రిక

VIBHARE TELUGU DAILY




PUBLISHED FROM KURNOOL ఎడిటర్ : ఆవుల విజయ భాస్కర రెడ్డి మంగళవారం 04-04-2023 సంపుటి : 04 సంచిక : 189 పేజీలు : 4 వెల : రూ 3-00

# నవరత్నాలు- పేదలందరికీ ఇళ్లు : తీరనున్న ఆ జిల్లాల పేదల కల



అమరావతి: నవరత్నాలు-పేదలందరికీ ఇళ్లు కార్యక్రమంలో భాగంగా గుంటూరు, కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల పేదల కల నెరవేరనుంది. ఇళ్లు లేనివారికి అమరావతిలో ఇళు పట్టాలు ఇవ్వాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన 33వ సీఆర్డీఏ అధారిటీ సమావేశంలో నిర్ణయించారు. ఈ మేరకు సమావేశంలో ఆమోద ముద్ర పడింది. నవరత్నాలు- పేదలందరికీ ఇళ్లు కార్యక్రమం మూడో విడతలో భాగంగా వీరికి ఇళ్ల పట్టాలు ఇవ్వాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిర్ణయించారు. లబ్ధిదారుల జాబితాతో డీపీఆర్‌లు తయారు చేయాలని గుంటూరు, ఎన్టీఆర్ జిల్లాల కలెక్టర్లకు ఆదేశాలు జారీ చేశారు. ఈ ప్రతిపాదనలు సీఆర్డీఏకు అప్పగించాలని ఆదేశాల్లో పేర్కొన్నారు. ఇళ్ల నిర్మాణానికి అవసరమైన కనీస మౌలిక సదుపాయాలను వెంటనే కల్పించేలా తగిన కార్యాచరణ రూపొందించుకోవాలని సీఎం జగన్ సూచించారు. మేనెల మొదటివారం నాటికి.. పనులు ప్రారంభమయ్యేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఇళ్లులేని పేదల చిరకాల వాంఛ నెరవేర్చే ఈ కార్యక్రమాన్ని వేగవంతంగా ముందుకు తీసుకెళ్లాలని సీఎం జగన్ పేర్కొన్నారు. న్యాయపరమైన చిక్కులు వీడిన తర్వాత పేదలకు ఇళ్ల పట్టాలు దక్కనున్నాయి. అమరావతితో పేదలందరికీ ఇళ్లు కార్యక్రమం కోసం ఇళ్ల స్థలాలు కేటాయిస్తూ జీవో జారీ చేశారు. దీనిలో భాగంగా అమరావతిలో 1134.58 ఎకరాల భూమి పేదల ఇళ్లకోసం కేటాయించారు. మొత్తం 20 లే అవుట్లలో స్థలాలు కేటాయింపు జరుగనుంది. గుంటూరు, కృష్ణా జిల్లాలకు చెందిన 48, 218 మందికి ఇళ్ల పట్టాలు కేటాయించనున్నారు. ఐనవోలు, మందడం, కృష్ణాయపాలెం, నవులూరు, కూరగల్లు, నిడమనూరు ప్రాంతాల్లో ఇళ్ల స్థలాలు ఇవ్వనున్నారు.



# న్యాయానికి బ్రాండ్ అంబాసిడర్‌గా సీబీఐ: ప్రధాని మోదీ

దిల్లీ: కేంద్ర దర్యాప్తు సంస్థ సీబీఐ న్యాయానికి బ్రాండ్ అంబాసిడర్‌గా మారిందని ప్రధాని నరేంద్రమోదీ అన్నారు. అందుకే న్యాయం కోసం ప్రతిఒక్కరూ సీబీఐ విచారణ కావాలని డిమాండ్ చేస్తుంటారని వ్యాఖ్యానించారు. ఈ సంస్థ సామాన్య ప్రజలకు నమ్మకాన్నిచ్చిందని చెప్పారు. సోమవారం దిల్లీలో సీబీఐ డైమండ్ జూబ్లీ వేడుకల ప్రారంభ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. 'ఏదైనా కేసు పరిష్కారం కాకపోతే.. దానిని సీబీఐకి అప్పగించాలనే డిమాండ్ ఇప్పటికీ వినిపిస్తూనే ఉంటుంది. సమర్థవంతమైన సంస్థలు లేకుండా అభివృద్ధి చెందిన దేశాన్ని నిర్మించడం సాధ్యం కాదు. అవినీతి అనేది ప్రజాస్వామ్యం, న్యాయవ్యవస్థకు అతిపెద్ద అవరోధంగా మారింది. ఈ అవినీతి నుంచి భారత్‌ను విముక్తి చేయడం ఈ సంస్థ ముందున్న అతిపెద్ద భాధ్యత. 10 ఏళ్ల క్రితం అవినీతికి పాల్పడేందుకు పోటీ ఉండేది. ఆ సమయంలో పెద్దపెద్ద కుంభకోణాలు జరిగాయి. అయితే వ్యవస్థలు వారికి అనుకూలంగా ఉండటంతో నిందితులు



భయపడేవారుకాదు. మా ప్రభుత్వం నల్లధనం, బినామీ ఆస్తులపై యుద్ధప్రాతిపదికన చర్యలు ప్రారంభించింది. దీంతో పాటు అవినీతికి దారితీసే పరిస్థితులపై పోరాడుతోంది. మీరు శక్తిమంతమైన వ్యక్తులపై చర్యలు తీసుకోవాల్సి ఉంటుంది. ఆ విషయం నాకు తెలుసు. వారు ఏళ్ల తరబడి వ్యవస్థలో ఉన్నారు. ఇప్పటికీ వారు కొన్ని రాష్ట్రాల్లో అధికారంలో ఉన్నారు. కానీ మీరు మీ పనిపై మాత్రమే దృష్టిపెట్టండి. అవినీతిపరుల్ని ఎట్టిపరిస్థితుల్లో వదలొద్దు' అంటూ ప్రధాని అధికారులకు సూచించారు. దర్యాప్తు సంస్థలను కేంద్ర ప్రభుత్వం తమ సొంత అవసరాలకు వాడుకుంటోందని, ప్రభుత్వ విధానాలను విమర్శిస్తోన్నప్రతిపక్ష నేతలపై ఈడీ, సీబీఐ, ఐటీ సంస్థల నుంచి నోటీసులు వస్తున్నాయని విపక్ష నేతలంతా తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అయితే ఈ విమర్శలపై మోదీ నుంచి అంతేస్థాయిలో కౌంటర్ వచ్చిన సంగతి తెలిసిందే. అవినీతికి వ్యతిరేకంగా గతంలో ఎవ్వరూ చేయని రీతిలో తమ ప్రభుత్వం కొరడా ఝుళిపిస్తుండడంతో విపక్షాలన్నీ ఏకతాటిపైకి వస్తున్నాయన్నారు. తప్పుడు అభియోగాలు తమను అడ్డుకోలేవనీ, అవినీతిపరులపై చర్యల విషయంలో వెనక్కి తగ్గేదే లేదని స్పష్టంచేశారు

# నెలలో 20 రోజుల పాటు ప్రజల్లోనే ఉండాలి: పార్టీ నేతలకు జగన్ ఆదేశం



అమరావతి: నెలలో 20 రోజుల పాటు ప్రజల్లోనే ఉండాలని పార్టీ ఎమ్మెల్యేలు, మంత్రులను వైకాపా అధినేత, సీఎం జగన్ ఆదేశించారు. 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమంపై సమీక్షలో భాగంగా ఎమ్మెల్యేలు, మంత్రులు, ప్రాంతీయ సమన్వయకర్తలతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా జగన్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఏడాదిలోపు ఎన్నికలు ఉండొచ్చని ఆయన చెప్పారు. సెప్టెంబర్ నాటికి 'గడప గడపకు మన ప్రభుత్వం', ఇతర కార్యక్రమాలు పూర్తిచేయాలని సీఎం చెప్పారు. ఆగస్టు వరకు 'గడపగడపకు మన ప్రభుత్వం' కొనసాగించాలని జగన్ సూచించారు. సెప్టెంబర్ నుంచి కొత్త కార్యక్రమాన్ని ప్రారంభిస్తామన్నారు. ప్రజల వ్యక్తిగత సమస్యల పరిష్కారానికి ఈనెల 13 నుంచి 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నట్లు సీఎం తెలిపారు. ఈ సందర్భంగా గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటమిపై జగన్ స్పందించినట్లు తెలిసింది. ఆ ఓటర్లలో 80 శాతం మంది ప్రభుత్వ పథకాల లబ్ధిదారులు కాదని ఆయన వ్యాఖ్యానించినట్లు సమాచారం. ఈ సమీక్షకు పలువురు మంత్రులు, మరికొందరు ఎమ్మెల్యేలు రాలేదు. మంత్రుల్లో ధర్మాన ప్రసాదరావు, బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి, విడదల రజిని హాజరుకాకపోవడం గమనార్హం

# మంత్రివర్గంలో మార్పుల సమాచారం లేదు

## ఇప్పుడే మార్పులు ఉంటాయని అనుకోవడం లేదు

## మంత్రులు అంబటి, రోజాల అభిప్రాయం

అమరావతి,ఏప్రిల్3 : ఏపీ మంత్రి వర్గంలో మార్పులు చేర్పులు జరుగుతాయంటూ వస్తున్న వార్తలపై మంత్రులు స్పందిస్తున్నారు. ఇది సిఎం జగన్ నిర్ణయమని అంటున్నారు. మంత్రులు అంబటి రాంబాబు, రోజలు దీనిపై స్పందించారు. మంత్రివర్గంలో మార్పులు చేర్పులు అనే సమాచారం తన వద్ద లేదని స్పష్టం చేశారు. అలాంటి మార్పులు ఇప్పుడు ఉంటాయని అనుకోవడం లేదన్నారు. ఈనెల 7 నుంచి జగనన్న మా భవిష్యత్తు కార్యక్రమం ఏర్పాటు చేస్తున్నారని... దీనిపైన గడప గడపలో చర్చ ఉంటుందని మంత్రి అంబటి రాంబాబు పేర్కొన్నారు. గడపగడపకు మన ప్రభుత్వంపై సీఎం జగన్ సమీక్ష చేయనున్న నేపథ్యంలో మంత్రి అంబటి తాడేపల్లి క్యాంప్ ఆఫీస్‌కు చేరుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. అధినేత జగన్‌కు మన ప్రభుత్వంపై సమీక్షిస్తారని.... ఎవ్వరిదైనా గ్రాఫ్ బాగోపోతే ముందే వారికి తప్పుకోవాలని చెపుతారన్నారు. పార్టీ అధికారంలోకి వస్తే వారికి ప్రాధాన్యం ఇస్తామని సీఎం జగన్ ముఖం మీదే చెపుతారని తెలిపారు. ఈరోజు అయితే మీకు సీటు లేదని ఎవ్వరికి చెపుతారు అనుకోవడం లేదని అన్నారు. కాగా.. గడపగడపకు మన ప్రభుత్వం ఐదో విడదల వర్క్ షాప్‌కు సర్వం సిద్ధమైంది. జగన్ననే మా భవిష్యత్తు



స్టిక్కర్ల పంపిణీ కార్యక్రమమే ప్రధాన అజెండాగా తాడేపల్లి క్యాంపు ఆఫీసులో సమావేశం జరుగనుంది. ఇప్పటికే ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, మంత్రులు, ఎంపిలు, నియోజకవర్గ సమన్వయకర్తలు, ప్రాంతీయ సమన్వయకర్తలు.. సీఎం క్యాంపు కార్యాలయానికి చేరుకున్నారు. మంత్రివర్గంలో మార్పు ఉంటుందని అనుకోవడం లేదని మరో మంత్రి రోజా చెప్పుకొచ్చారు. గడప గడపకు మన ప్రభుత్వంపై మాత్రమే నేటి సమావేశంలో చర్చ ఉంటుందని స్పష్టం చేశారు. వాతావరణాన్ని మీడియానే హాట్ హాట్ చేసేస్తోందని అన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ తరువాత అసెంబ్లీ సమావేశాలతో గడపగడపకు కాస్తా గ్యాప్ వచ్చిందని.. దీంతో ఇదే అంశంపై మరోసారి చర్చించుకుంటామని తెలిపారు. మంత్రివర్గంలో మార్పు ఉంటుందని అనుకోవడం లేదన్నారు. ఇచ్చి కూడా సంవత్సరం కూడా కాలేదు... ఇంకా కుదురుకోలేదని అన్నారు. ఇప్పుడే ఛేంజస్ ఉంటాయి అనుకోవడం లేదని తేల్చిచెప్పారు. రాష్ట్రంలో మంత్రులు అందరూ బాగానే పనిచేస్తున్నారని మంత్రి రోజా పేర్కొన్నారు.

# జీవో నంబర్ 45పై రాజధాని ఐకాస లంచ్‌మోషన్ పిటిషన్



అమరావతి: రాజధాని అమరావతి పరిధిలో ఇతర జిల్లాల వారికి ఇళ్ల స్థలాల కేటాయింపునకు ఏపీ ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో నంబర్ 45పై రాజధాని రైతు ఐకాస నేతలు హైకోర్టును ఆశ్రయించారు. ఈ మేరకు లంచ్‌మోషన్ పిటిషన్‌ను దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై కాసేపట్లో విచారణ జరగనుంది. సీఆర్డీఏ పరిధిలో 1130 ఎకరాల భూమిని ఇళ్లస్థలాలకు ఇవ్వాలని ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. గుంటూరు, ఎన్టీఆర్ జిల్లాల కలెక్టర్లకు భూమిని అప్పగించాలని జీవోలో పేర్కొన్నారు. దీనిపై మార్చి 31న పురపాలక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి శ్రీలక్ష్మి జీవో విడుదల చేశారు. ఆ భూమి విలువ రూ.1162 కోట్లుగా జీవోలో ప్రభుత్వం పేర్కొంది. తమ భూముల్లో ఇతరులకు ఇళ్ల స్థలాలు కేటాయిస్తామని చెప్పడంపై రాజధాని రైతులు మండిపడుతున్నారు.

# దిల్లీకి పవన్.. భాజపా ముఖ్యులతో భేటీకానున్న జనసేనాని

దిల్లీ: జనసేనఅధినేత పవన్‌కల్యాణ్ దిల్లీలో పర్యటిస్తున్నారు. ఆదివారం రాజస్థాన్‌లోని ఉదయ్‌పూర్ వెళ్లిన పవన్..నేడు హస్తినకు చేరుకున్నారు. పవన్‌తో పాటు జనసేన రాజకీయ వ్యవహారాల కమిటీ ఛైర్మన్ నాదెండ్ల మనోహర్ కూడా ఉన్నారు. దిల్లీ పర్యటనలో భాగంగా భాజపా(ఃఏఖ)కు చెందిన పలువురు ముఖ్యనేతలు, కేంద్రమంత్రులతో పవన్, మనోహర్ భేటీ కానున్నారు. ఏపీలో ఇటీవల జరుగుతున్న పరిణామాలు, తాజా రాజకీయ పరిస్థితులు, భవిష్యత్తు కార్యాచరణ తదితర అంశాలపై భాజపా పెద్దలతో పవన్ చర్చించే అవకాశముంది. ఇటీవల రాష్ట్ర భాజపా నేతలు, జనసేన మధ్య దూరం పెరిగిందనే ఊహాగానాల నేపథ్యంలో జనసేనాని దిల్లీ పర్యటనపై ఆసక్తి నెలకొంది.




# తెలంగాణ హైకోర్టు తొలి ప్రధాన న్యాయమూర్తి

## టిబి.రాధాకృష్ణన్ కేరళలో కన్నుమూత

కొచ్చి,ఏప్రిల్3 : తెలంగాణ హైకోర్టు తొలి ప్రధాన న్యాయమూర్తి, రిటైర్డ్ జడ్జి తొట్టతిల్ బి.రాధాకృష్ణన్ (63) సోమవారం తెల్లవారుజామున కన్నుమూశారు. కొంతకాలంగా రాధాకృష్ణన్ అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఈ క్రమంలో కొచ్చిలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు. రాధాకృష్ణన్ కేరళ రాష్ట్రంలోని కొల్లాంలో 1959 ఏప్రిల్ 29న జన్మించారు. అక్కడే పాఠశాల విద్య పూర్తి చేసుకున్నారు. తిరువనంతపురంలో 1983లో న్యాయవాదిగా తన వృత్తిని ప్రారంభించారు. రాధాకృష్ణన్ తెలంగాణ రాష్ట్రంలోని ప్రత్యేక హైకోర్టుకు మొదటి ప్రధాన న్యాయమూర్తి. 2019 జనవరిలో తెలంగాణ హైకోర్టు తొలి ప్రధాన న్యాయమూర్తిగా అప్పటి గవర్నర్ నర్సింహన్ సమక్షంలో ప్రమాణ స్వీకారం చేశారు. ఆయన ఛత్తీస్‌గఢ్, ఆంధ్రప్రదేశ్ హైకోర్టులలో ప్రధాన న్యాయమూర్తిగా కూడా పనిచేశారు. తెలంగాణ హైకోర్టులో ప్రధాన న్యాయమూర్తిగా రాధాకృష్ణన్ కొన్ని నెలలు మాత్రమే కొనసాగారు. టీబీ రాధాకఅష్ణన్ 2004 అక్టోబర్ 14న కేరళ హైకోర్టు న్యాయమూర్తిగా ప్రమాణ స్వీకారం చేశారు. రెండుసార్లు కేరళ హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తిగా నియమితులయ్యారు. కేరళ లీగల్ సర్వీసెస్ ఎగ్జిక్యూటివ్ చైర్మన్‌గానూ కొనసాగించారు. 12ఏళ్లు కేరళ హైకోర్టులో న్యాయమూర్తిగా పనిచేసిన తర్వాత కోల్‌కతా హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా పదవీ విరమణ చేశారు.



# ఏపీలో టెన్త్ పరీక్షలు షురూ

విజయవాడ ఆంధ్రప్రదేశ్లో సోమవారం నుంచి ఎస్ఎస్సీ పరీక్షలు ప్రారంభమ య్యాయి. ఈ నెల 13వ తేదీ వరకు జరిగే ఈ పరీక్షలకు ప్రభు త్వం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. రాష్ట్రవ్యాప్తంగా 3,349 పరీక్ష కేంద్రాల్లో ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు పరీక్షలు నిర్వ హించనుండగా.. ఈ ఏడాది 6,64,152 మంది విద్యాబుర్థులు పరీక్షలకు హాజరు కానున్నారు. వీరిలో రెగ్యులర్ అభ్యర్థు ల సంఖ్య 6,09,070గా ఉంది. ఉదయం 8.45 నుంచి 9.30 గంటల వరకు మాత్ర మే విద్యార్థులను పరీక్ష కేంద్రా ల్లోకి అనుమతిస్తారు.. ప్రత్యేక పరిస్థితులు ఉంటే తప్ప.. ఒక్క నిమిషం ఆలస్యం అయినా పరీక్ష కేంద్రంలోకి అనుమతిం చేది లేదని ఇప్పటికే అధికారులు స్పష్టం చేశారు. మరోవైపు.. ఒక్కో గదిలో 24 మంది విద్యార్థులు మాత్ర మే ఉండేలా చర్యలు తీసుకున్నారు. గత అనుభవాల దృష్ట్యా పేపర్ లీక్ అనేది లేకుండా పక్కాగా నిఘా ఏర్పా ట్లు చేశారు. ఎక్కడైనా, ఏదైనా అవాం ఛనీయ ఘటన, లీక్ జరిగితే అది ఎక్కడ జరిగిందో వెంటనే కనిపెట్టేలా సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తు న్నారు అధికారులు. ముఖ్యంగా పరీక్ష కేంద్రాల దగ్గర 144 సెక్షన్ విధించారు పోలీసులు.. సమస్యాత్మక పరీక్ష కేంద్రా ల దగ్గర సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు.

# సంపాదకీయం

మంగళవారం 04-04-2023

## సత్వర న్యాయం సాధ్యం కాదా...

భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 21 పౌరుని హక్కుగా సత్వర న్యాయం అందజేయాలని చెప్తుంది. సీనియర్ న్యాయవాది వేరే కోర్టులో బిజీగా ఉన్నాడని జూనియర్ న్యాయవాది చెప్పటం, వెంటనే న్యాయమూర్తి కేసు వాయిదా వేయటం, ఎంతకాలమైనా జూనియర్ న్యాయవాది కేసు కొనసాగించకపోవటం లాంటి పస లేని, జవాబుదారీతనం లేని కారణాలు ఎన్నో. ఏళ్ల కొద్దీ విచారణ పేరుతో కేసును సాగదీయటం రాజ్యాంగం కల్పించిన నిందితుడి హక్కుకు తూట్లు పొడవటమే కాకుండా అతడిని మానసిక క్షోభ, ఆందోళనకు గురి చేయటం కూడా శిక్ష విధించటం లాంటిదైనని అరుణ్ కుమార్ ఘోష్ వర్సెస్ స్టేట్ ఆఫ్ బెంగాల్, కర్తార్ సింగ్ వర్సెస్ స్టేట్ ఆఫ్ పంజాబ్ అనే కేసుల్లో సుప్రీంకోర్టు నిర్వచించింది. తీర్పు ఆలస్యానికి జరిగే కారణాలను, మార్గదర్శకాలను సుప్రీం కోర్టు గతంలోనే అబ్దుల్ రహమాన్ వర్సెస్ ఎస్ ఆర్ నాయక్ కేసులో సూచించింది. 1998 ఏప్రిల్‌లో ఆంధ్రప్రదేశ్ పరిపాలనా ట్రిబ్యునల్ ఇచ్చిన ఆదేశాలను అమలు పరచటం కోసం తన నుండి ఐదువేల రూపాయలు లంచం డిమాండ్ చేసినట్లుగా ఒక ప్రధానోపాధ్యుడు ఫిర్యాదు చేసారు. దీంతో అవినీతి నిరోధక శాఖ అధికారులు వల పన్ని ఒక ఎంపీడివో డబ్బులు తీసుకుంటుండగా రెడ్ హాండెడ్‌గా పట్టుకుని, అతడిపై అభియోగం మోపుతూ విజయవాడలోని అనిశా ప్రత్యేక కోర్టు ముందు ఛార్జిషీట్ దాఖలు చేశారు. ఏడు సంవత్సరాల పాటు సాక్షుల సుదీర్ఘ విచారణ, వాదనల అనంతరం అభియోగం రుజువు కాలేదని 2005లో అనిశా కోర్టు కేసు కొట్టివేస్తూ, ఎంపీడివోను నిర్దోషిగా ప్రకటిస్తూ తీర్పిచ్చింది. ఆ తీర్పుతో తృప్తి చెందని అనిశా 2007లో ఉమ్మడి హైకోర్టుకు అప్పీలు చేసింది. అప్పటికే ఎంపీడివో వయస్సు 64 సంవత్సరాలు. తదనంతర రాష్ట్ర విభజన మూలంగా అప్పీలు అమరావతి హైకోర్టుకు బదిలీ అయింది. వాదనలు విన్న హైకోర్టు 2005లో అనిశా కోర్టు ఇచ్చిన తీర్పును రద్దు చేస్తూ, విశ్రాంత అధికారికి ఏడాది జైలు శిక్ష, పదివేల రూపాయల జరిమానా విధిస్తూ 2023 ఫిబ్రవరిలో తీర్పిచ్చింది. 1998 లో మోపిన నేరానికి 25 సంవత్సరాల సుదీర్ఘ నిరీక్షణ అనంతరం తన 80వ ఏట ఒక ఏడాది పాటు జైలు జీవితం గడపాల్సిన దుస్థితికి కారణం నిందితుడి స్వయంకృతాపరాధమనుకుందామా!తోటి ప్రభుత్వ ఉద్యోగి నుండే లంచం డిమాండ్ చేయటం క్షమించరాని నేరమే. ఈ విషయంలో దాక్షిణ్యత ఏ మాత్రం ఉండకూడదు. ఇక్కడ అసలు సమస్య అది కాదు. అనిశా కోర్టు తీర్పుకు ఏడు సంవత్సరాలు, హైకోర్టు తీర్పుకు 16 సంవత్సరాలు పట్టిన సమయం గురించి ఆలోచించాలి. ఈ తీర్పుపై సుప్రీంకోర్టులో స్పెషల్ లీవ్ పిటిషన్ వేసుకునే అవకాశం నిందితుడికి ఉంటే ఉండవచ్చు. సుప్రీం ధర్మాసనం నుండి బెయిలు లభించే దాకా ఈ వృద్ధాప్యంలో, అనారోగ్యంతో బాధ పడుతూ కొన్నాళ్ళ పాటు నిందితుడు జైలు జీవితం గడపాల్సిందే. అక్కడ ఎంత కాలం నిరీక్షణ ఉంటుందో తెలియదు. దాదాపు 25 సంవత్సరాల పాటు కేసులో తీర్పుకై నిరీక్షిస్తూ అతడు, అతని కుటుంబ సభ్యులు నిస్సందేహంగా ఎంతో మానసిక సంఘర్షణను, క్షోభను అనుభవించటమే కాకుండా సంఘంలో చులకనకు గురై ఉంటారు!. వ్యక్తిగత జీవితంతో ముడిపడిన క్రిమినల్ కేసులు ఏళ్ల కొద్దీ కోర్టులో పెండింగ్ ఉండటం మూలాన మానసికంగా మాత్రమే కాకుండా, వేతనం, పెన్షన్ కూడా పొందకుండా నిందితుడు ఆర్థికంగా నష్టపోతాడనటంలో ఎటువంటి సందేహం లేదు. నేరారోపణకు గురైన వ్యక్తిని జీవితంలో సగభాగం మానసిక సంఘర్షణకు గురి చేయటం భావ్యం కాదు. తుది తీర్పు తగిన సమయంలో వచ్చి ఉంటే నిందితుడు భవిష్యత్ జీవితాన్ని తగిన విధంగా మలచుకొని, ఆర్థికంగా నిలదొక్కుకునే అవకాశం ఉంటుంది. విచారణలో జాప్యానికి కారణం నిందితుడా లేక న్యాయవ్యవస్థా లేక ప్రభుత్వమా? స్వయంగా నిందితుడు కారణమైతే అతడు అనుభవించాల్సిందే. అలా కాకుండా రాజ్యం కారణమైతే నిందితుడికి పరిహారం ముట్టజెప్పే విధంగా సంస్కరణలు తేవాలి. ముఖ్యంగా న్యాయవ్యవస్థతో ముడిపడిన ప్రతి ఒక్కరు జవాబుదారితనంతో వ్యవహరించినప్పుడే జాప్యాన్ని కొంతవరకు నివారించవచ్చు.

# ఎమ్మెల్యేలు ఎక్కువ – ఆశావహులూ ఎక్కువే !

విజయవాడ, ఏప్రిల్ 3, ఏపీ సీఎం జగన్మోహన్ రెడ్డి ఎన్నికలకు ముందు తన కేబినెట్‌లో మార్పు చేర్పులు చేయాలనుకుంటున్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల ఫలితాలు రాక ముందే కేబినెట్‌లో మార్పు చేర్పుల గురించి సీఎం జగన్ సూచనలు ఇచ్చారు. ఆ తర్వాత ఎమ్మెల్సీ ఎన్నికల ఫలితాలు వచ్చాయి. ఇప్పుడు ఖచ్చితంగా మంత్రివర్గాన్ని మార్చాలని అనుకుంటున్నట్లగా తెలుస్తోంది. అయితే గతంలోలా అంత సులువుగా అయ్యే రాజకీయ పరిస్థితులు లేవు . గతంలో మంత్రులందరి వద్ద రాజీనామాలు తీసుకున్నప్పుడు పరిస్థితులు వేరు.. ఇప్పటి పరిస్థితులు వేరు. గతంలో ఆయన మాటను సీనియర్లు కూడా జవదాటేవారు కాదు. కానీ ఇప్పుడు ఎన్నికలకు ముందు ఆయనకు ఇబ్బందికర పరిస్థితులు ఎదురవుతున్నాయి.సీఎం జగన్ గత ఎన్నికల్లో అతి భారీ మెజార్టీ సాధించడం కూడా ఆయనకు ఇప్పుడు ఇబ్బందికరంగా మారింది. ఎమ్మెల్యేల్లో అత్యధిక మంది రాజకయంగా తనతో నడుస్తున్న వారే ఉన్నారు. వారంతా మంత్రి పదవులు కోరుకుంటున్నారు. కానీ వివిధ రాజకీయ సమీకరణాల రీత్యా మధ్యలో వచ్చి చేరిన సీనియర్లకు పదవులు ఇవ్వాల్సి వచ్చింది. ఈ కారణంగా తనతో పాటు నడిచిన ఎమ్మెల్యేలకు ప్రాధాన్యం ఇవ్వలేకపోయారు.వారంతా తమకు చాన్స్ కోరుకుంటున్నారు. తమకు లేని చాన్స్ మధ్యలో వచ్చిన వారికి రావడం వారిని మరింత ఇబ్బంది పెడుతోంది. ఇలాంటి సీనియర్లు ప్రతీ జిల్లాలోనూ ఉన్నారు. ఆ అసంతృప్తి గతంలో మంత్రివర్గ పునర్ వ్యవస్థీకరణ జరిగినప్పుడే బయటపడింది. చాలా మందిని సీఎం జగన్ ప్రత్యేకంగా బుజ్జగించాల్సి వచ్చింది.ఏడాది కిందట వరకూ సీఎం జగన్ ఏది చెబితే అది శాసనం. కానీ మంత్రివర్గ పునర్‌వ్యవస్థీకరణ చేసిన తర్వాత సీన్ మారిపోయింది. ఆయన పై ఎమ్మెల్యేలు చాలా మంది అసంతృప్తి వ్యక్తం చేశారు. ఆయన మాటలను కూడా వినిపించుకోలేదు. ఇలాంటి వారిలో అత్యధికులు జగన్ వెంట నడిచినవారే. అదే సమయంలో మంత్రి పదవులు కోల్పోయిన వారిలోనూ అసంతృప్తి ఉంది. కానీ బయట పడలేదు. కొడాలి నాని, పేర్ని నాని, సుచరిత వంటి వారు తామేం తప్పు చేశామని ఫీలయ్యారు. సుచరిత ఒక్కరే బయటపడ్డారు. తమ ప్రాధాన్యతను సీఎం జగన్ గుర్తిస్తారని ఇతర మంత్రులు ఆశతో ఉన్నారు. ఇప్పుడు మంత్రివర్గంలో మార్పు చేర్పులు అనేసరికి వారు కూడా ఆశలు పెంచుకుంటున్నారు. ఇలాంటి వారికి అందరికీ సీఎం జగన్ పదవులు ఇవ్వలేరు. అలాగే వారు అసంతృప్తిని వ్యక్తం చేస్తే బుజ్జగించడమూ కష్టమే. ఎమ్మెల్యేలపై సీఎం జగన్‌కు పూర్తి స్థాయి పట్టు ఉందని అనుకున్నారు. కానీ ఎమ్మెల్సీ ఎన్నికల్లో అది పూర్తిగా నిజం కాదని తేలిపోయింది. నలుగురు ఎమ్మెల్యేలు అధికార పార్టీని ధిక్కరించి ప్రతిపక్ష పార్టీకి ఓటు వేయడం అంటే చిన్న విషయం కాదు. అదీ కూడా ఏడాదిపైగా అధికారం ఉన్న సమయంలో. అధికార పార్టీకి విపక్ష సభ్యులు మద్దతిస్తే అందులో ఓ లాజిక్ ఉంటుంది .పార్టీపై పూర్తి స్థాయిలో పార్టీపై పట్టు ఉన్నట్లుగా భావిస్తున్న జగన్ పార్టీలో ఇలా జరగడం మాత్రం ఆశ్చర్యమే కాదు. ఇంకా చాలా మంది ఎమ్మెల్యేలు అసంతృప్తిలో ఉన్నారన్న ప్రచారం జరగడమూ ఇబ్బందికరమే. వీరిలో పార్టీలో ...ప్రభుత్వంలో ప్రాధాన్యం దక్కడం లేదన్న అసంతృప్తిలో ఉన్నారు. మంత్రివర్గ విస్తరణ తర్వాత ఇలాంటి వారిని కంట్రోల్ చేయడం కష్టమే. ప్రస్తుతం పదవుల్ని కోల్పోయే మంత్రులు కూడా అసహనానికి గురవుతారు. తమను పనికి రాని వాళ్లుగా తేల్చి తీసేస్తున్నారని వారు ఫీలయితే మొదటికే మోసం వస్తుంది. అందుకే సీఎం జగన్ ఇప్పుడు కత్తిమీద సాములా కేబినెట్‌లో మార్పుచేర్పులు చేయాల్సి ఉంది.

# ఇంకా ప్రొబేషన్ లోనే 17 వేల మంది

విజయవాడ, ఏప్రిల్ 3,ఆంధ్రప్రదేశ్ గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులు రెండో విడత ప్రొబేషన్ డిక్లేర్ ప్రక్రియ ముందుకు సాగడం లేదు. 2020 డిసెంబరులో నెలలో రెండో విడతలో ఎంపికైన గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగులకు 2022 డిసెంబరు నెలతో రెండేళ్లు సర్వీసు పూర్తయినప్పటికీ నేటికీ ప్రొబేషన్ డిక్లేర్ చేయలేదు. ఉద్యోగ సంఘ నాయకుల ద్వారా ఎప్పటికప్పుడు ప్రయత్నాలు చేస్తున్నా ప్రభుత్వం నుంచి స్పష్టత రావడం లేదు. రెండో విడతలో ఎంపికైన గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగుల ప్రొబేషన్ డిక్లేర్ ప్రక్రియ జూలైలో కానీ లేక ఆగస్టులో ఉండే అవకాశాలున్నాయని ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి. కానీ, అప్పుడైనా ప్రకటిస్తారా? అంటే అధికారుల నుంచి సరైన సమాధానం లేదని ఉద్యోగులు ఆందోళన ?ందుతున్నారు.మొదటి నోటిఫికేషన్ ద్వారా రిక్రూట్ అయిన వారికి 9నెలలు ఆలస్యంగా ప్రొబేషన్ డిక్లేర్ చేశారు. గతేడాది మార్చి నాటికే ప్రొబేషన్ డిక్లేర్ ప్రక్రియ పూర్తవుతుందని అధికారులు ప్రకటించారు. ఆ గడువు పూర్తయి ఏడాది గడచినా ఇంతవరకు దీని అతీగతి లేదు. మార్చి నెల ముగుస్తున్నా ఇందుకు సంబందించిన కసరత్తు పూర్తి కాక పోవడంతో ప్రొబేషన్ కోసం ఎంతో ఆశగా ఎదురు చూస్తున్న గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల్లో తీవ్ర అసంతృప్తి నెలకొంది. ప్రొబేషన్ డిక్లేర్ కాక పోవడంతో సుమారు 17వేల మంది ఉద్యోగులు కేవలం రూ.15వేల జీతానికి విధులు నిర్వహించడం కష్టంగా మారిందని వారు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం తక్షణమే చర్యలు చేపట్టాలని ఎపి గ్రామ వార్డు సచివాలయ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం కోరుతోంది. గ్రామ సచివాలయ వ్యవస్థ ద్వారా ఎంపికైన 7040 మంది గ్రేడ్ -5 పంచాయితీ కార్యదర్శులకు నేటికీ అధికారాల బదిలీ జరగలేదు. దీంతో జాబ్ చార్ట్ ప్రకారం విధులు నిర్వహించలేని పరిస్థితి నెలకొందని పేర్కొంటున్నారు. పంచాయతీరాజ్‌శాఖ విడుదల చేసిన జీఓ నెంబరు 149లో డిడిఓ అధికారాలు ఉంటాయని పేర్కొంది. అధికారాల బదిలీల ప్రక్రియ నేటికీ పూర్తి కాలేదు. క్లస్టర్ వ్యవస్థను రద్దు చేసి ప్రతి పంచాయితీ కార్యదర్శిని నియమించాలని డిమాండ్ చేస్తున్నారు. గ్రామ సచివాలయాల్లో పనిచేసే గ్రేడ్?5 పంచాయతీ కార్యదర్శులకు రూ. 15,030 కనిష్టంగా పే స్కేలును సిఫార్సు చేయగా, గరిష్టంగా రూ. 46,060గా పేర్కొంది. డిజిటల్ అసిస్టెంట్, మహిళా పోలీసు, పశుసంవర్ధక శాఖ అసిస్టెంట్, ఫిషరీస్ అసిస్టెంట్, ఏఎన్ఎం, ఇంజనీరింగ్ అసిస్టెంట్, గ్రేడ్?2 అగ్రికల్చర్ అసిస్టెంట్, హార్టికల్చర్ అసిస్టెంట్, సెరికల్చర్ అసిస్టెంట్, విలేజ్ సర్వేయర్, వీఆర్వో, వేల్ఫర్ అసిస్టెంట్లకు రూ. 14,600 కనిష్ట పే స్కేలును ప్రతిపాదించగా, గరిష్ట పే స్కేలు రూ. 44,870గా పీఆర్సీ కమిటీ సిఫార్సు చేసింది. వార్డు అడ్మినిస్ట్రేటివ్ సెక్రటరీకి రూ. 15,030 కనిష్ట పే స్కేలును సిఫార్సు చేయగా, గరిష్టంగా రూ. 46,060గా పేర్కొంది. మిగిలిన వార్డు ఎమినిటీస్ సెక్రటరీ, వార్డు ఎడ్యుకేషన్?డేటా ప్రాసెసింగ్ సెక్రటరీ, ప్లానింగ్ అండ్ రెగ్యులరైజేషన్ సెక్రటరీ, శానిటేషన్ అండ్ ఎన్విరాన్‌మెంట్ సెక్రటరీ, వెల్ఫర్ అండ్ డెవలప్‌మెంట్ సెక్రటరీలకు రూ. 14,600 కనిష్టంగా పే స్కేలును ప్రతిపాదించగా, గరిష్ట పే స్కేలు రూ. 44,870గా ఉంటుంది.

# 2019 తరహాలనే ఒంటరి పోరా..

రాజమండ్రి, ఏప్రిల్ 3,అసెంబ్లీ కన్వీనర్లను నియమించిన బీజేపీఏపీలో 175 నియోజకవర్గాలు ఉంటే.. 147 చోట్ల అసెంబ్లీ కన్వీనర్లను.. కో కన్వీనర్లను నియమించింది బీజేపీ. వచ్చే అసెంబ్లీ ఎన్నికలకు సిద్ధమన్న సంకేతాలు ఇచ్చింది. అయితే కన్వీనర్ల నియామకమే కొత్త చర్చకు ఆస్కారం ఇస్తోంది. ఇటీవల జనసేనతో పొత్తు.. ఆ పార్టీ సహకారంపై బీజేపీ రాష్ట్ర పదాధికారుల సమావేశంలో చర్చించారు. జనసేన తమకు ఎంత మాత్రం సహకరించడం లేదని మెజారిటీ నేతలు తమ అభిప్రాయంగా చెప్పారని టాక్. ఆ తర్వాత అసెంబ్లీ కన్వీనర్ల నియామకం బయటకు రావడంతో బీజేపీ ఓ నిర్ణయానికి వచ్చే ఈ ప్రకటన చేసిందని సమాచారం.జనసేన తమతో కలిసి రాదనే అభిప్రాయాన్ని బయటకు చెప్పకపోయినా.. ఆ విషయంలో ఒక స్పష్టతకు వచ్చిన ఏపీ బీజేపీ నేతలు.. అసెంబ్లీ ఎన్నికల్లో ఒంటరి పోరుకు సిద్ధం అవుతున్నట్టు తెలుస్తోంది. చివరి వరకు వేచి చూసేకంటే.. ముందుగానే అసెంబ్లీ సెగ్మెంట్లకు కన్వీనర్లను ప్రకటించి పార్టీ పని మొదలుపెట్టి.. అభ్యర్ధులను ఎంపిక చేసి ఫీల్డ్‌లోకి దిగొచ్చనే ఆలోచనలో కమలనాథులు ఉన్నట్టు ఆ పార్టీ వర్గాల వాదన. జనసేన కలిసి వచ్చినా రాకున్నా.. బీజేపీ బలోపేతం కావాలి కదా అని పదాధికారుల సమావేశంలో పార్టీ అగ్రనేత శివప్రకాష్ ప్రశ్నించారని.. క్షేత్రస్థాయిలో పార్టీ ప్రతినిధులు లేకపోతే ఇబ్బంది పడాల్సి వస్తుందని ఏపీ నేతలను ఆయన హెచ్చరించినట్టు తెలుస్తోంది. ఆ సమావేశంలో తీసుకున్న నిర్ణయం ప్రకారం 147 నియోజకవర్గాలకు సారథులను ఖరారు చేశారుప్రస్తుతం అసెంబ్లీ కన్వీనర్లుగా ఉన్నవారే వచ్చే ఎన్నికల్లో పోటీ చేస్తారనే వాదన బీజేపీలో ఉంది. అదే జనసేనతో పొత్తుపై ఆశలు సజీవంగా ఉండి ఉంటే 147 నియోజకవర్గాలకు ఈ విధంగా కన్వీనర్లను.. కో కన్వీనర్లను ప్రకటించరు కదా అని ప్రశ్నిస్తున్నారు. ఎన్నికలకు ఇంకా ఏడాది సమయం ఉండటంతో.. ఈలోగా వారి పనితీరును ఎప్పటికప్పుడు బేరీజు వేసుకుని అభ్యర్థులుగా ఖరారు చేయొచ్చనే అభిప్రాయంలో కూడా బీజేపీ ఉన్నట్టు తెలుస్తోంది. బీజేపీని విమర్శించే ప్రతి ఒక్కరూ అసలు 175 నియోజకవర్గాల్లో పార్టీకి అభ్యర్థులు ఉన్నారా అని ప్రశ్నిస్తుంటారు. ఆ విమర్శలకు కన్వీనర్ల నియామకంతో చెక్ పెట్టినట్టుగా కొందరి వాదన. మొత్తానికి నియోజకవర్గాల్లో బీజేపీ నాయకత్వాన్ని సిద్ధం చేయడం.. కన్వీనర్ల పేరుతో కార్యక్రమాల స్పీడ్ పెంచడం.. ఒంటరి పోరుకు కూడా సిద్ధమనే సంకేతాలు ఇవ్వడానికి ఏపీ లీడర్స్ క్రమంగా అడుగులు వేస్తున్నట్టు అర్థం అవుతోంది.గత అసెంబ్లీ ఎన్నికల్లోనూ ఏపీలో బీజేపీ సింగిల్‌గానే పోటీ చేసింది. నోటా కంటే తక్కువ ఓట్లు వచ్చాయనే విమర్శలు మూటగట్టుకుంది. 2019 ఎన్నికల తర్వాత పార్టీ రాష్ట్రంలో బలపడిందా అంటే.. పెదవి విరిచే పరిస్థితి. ఈ మూడేళ్లలో జరిగిన తిరుపతి లోక్‌సభ, బద్వేలు, ఆత్మకూరు ఉపఎన్నికలు, స్థానిక సంస్థలు, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎలక్షన్లలో బీజేపీకి వచ్చిన ఓట్లు ఆ పార్టీ బలాన్ని తెలియజేస్తున్నాయి. పొరుగునే ఉన్న తెలంగాణలోనూ ఏపీలోని బీజేపీ పరిస్థితికి అస్సలు పొంతన లేదు. తెలంగాణ మాదిరి పురోగతి ఉంటే ఈపాటికే బీజేపీ అగ్రనేతల ఫోకస్ పెరిగేది. అసలు ఢిల్లీ పెద్దలు ఏపీ బీజేపీ శాఖను పట్టించుకుంటున్నారో లేదో అన్న సందేహాలు పార్టీ శ్రేణుల్లోనూ ఉన్నాయి. ఇలాంటి తరుణంలో ఒంటరిపోరు అంటే బీజేపీ ఏ పొజిషన్‌లో ఉంటుందో చూడాలి.

# మంత్రివర్గ విస్తరణ ఆశావహులు గంపెడు ఆశలు

విజయవాడ, ఏప్రిల్ 3, ఆంధ్రప్రదేశ్‌లో మంత్రివర్గ విస్తరణపై భిన్న స్వరాలు వినిపిస్తున్నాయి. మంత్రివర్గం విస్తరణపై జగన్ నిర్ణయం తీసుకున్నారని ఇక మిగిలింది ప్రకటనే అన్న ప్రచారం గట్టిగా జరుగుతుంది. దీంతో ఆంధ్రప్రదేశ్‌లో మంత్రివర్గ విస్తరణ ఆశావహులు గంపెడు ఆశలు పెట్టుకున్నారు. ఇద్దరికి క్యాబినెట్‌లో చోట దక్కనుందనే ప్రచారం జరుగుతుంది. ఉత్తరాంధ్ర నుంచి ఒకరికి సామాజిక వర్గాల వారీగా, కులాల సమీకరణలో మరొకరికి స్దానం ఉంటుందన్న అంశం పార్టీలో చర్చ జరిగింది. ఇందులో భాగంగానే పలువురు పేర్లు కూడా తెర మీదకు వచ్చాయి. మంత్రి అప్పల రాజు ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డిని కలవటం, ఆ వెంటనే స్పీకర్ తమ్మినేని సీతారాం కూడా సీఎంను కలవటంపై ఊహాగానాలు మరింతగా పెరిగాయి. మంత్రివర్గం విస్తరణలో రెండే అంశాలు కీలకం అనే ప్రచారం కూడా లేకపోలేదు. మొదటిది ఉత్తరాంధ్ర ప్రాంతంపై ప్రత్యేకంగా పట్టు సాధించాలనే టార్గెట్‌ను జగన్ ఆలోచిస్తున్నారని, ఇంకొకటి పార్టీలో కులాల వారీగా మరింత బలం పెంచుకోవాలనే ఉద్దేశం ఉన్నట్లుగా పార్టీ వర్గాలు అంటున్నాయి. రాబోయే ఎన్నికలనే టార్గెట్‌గా చేసుకొని పార్టీని మరింతగా ముందుకు తీసుకువెళ్ళటంతోపాటు, ప్రభుత్వంలో కూడా కీలకంగా వ్యవహరించాల్సిన అంశాలను పరిగణంలోకి తీసుకొని జగన్ మంత్రివర్గంపై నిర్ణయం తీసుకున్నారనే ప్రచారం ఉంది.ఆంధ్రప్రదేశ్ క్యాబినేట్‌లో ఇప్పటి వరకు 25మంది మంత్రులు ఉన్నారు. శాసన మండలిలో కూడా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీకి బలం మరింతగా పెరిగింది. ఇటీవల జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలుపొందిన అభ్యర్థులతో కలపి శాసన మండలిలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ తరపున 43మంది సభ్యులు ఉన్నారు. దీంతో శాసన సభ, శాసన మండలిలో కూడా బలం పుష్కలంగా ఉన్న వేళ ఎన్నికలకు సమాయత్తం కావటానికి ఇప్పటి నుంచే బలాన్ని వినియోగించుకోవాల్సిన అవసరం ఉందనే అభిప్రాయంలో జగన్ ఉన్నారని పార్టీ వర్గాలు అంటున్నాయి.ఇప్పుడు క్యాబినేట్ మంత్రులతో సరిపెట్టుకోకుండా మరో రెండు మంత్రి పదవులు ఇవ్వటం ద్వారా అదనంగా వచ్చే లాభమేంటని అనుమానాలు మరికొందరు వ్యక్తం చేస్తున్నారు. కేవలం రెండు మంత్రి పదవులు కోసం కొత్తగా అభ్యర్థులను ఎంపిక చేస్తే పరిస్థితులు మరోలా ఉంటాయని అంటున్నారు. ఉన్న వారిని కాదని అదే స్థానంలో మరొకరికి ఛాన్స్ ఇస్తే మాత్రం రాజకీయంగా పరిస్థితులు మారతాయని చర్చ జరుగుతుంది. ఇప్పటికే సిదిర అప్పలరాజు, బొత్సా వంటి నేతల పేర్లు సోషల్ మీడియాలో ప్రచారం జరగటంతో కులాల వారీగా సమీకరణాలు ఎలా ఉంటాయన్నది ఆసక్తిగా మారింది.ఇప్పటికే ఉన్న మంత్రి వర్గంలో చాలా మంది అసహనంతో ఉన్నారని సోషల్ మీడియాలో రకరకాలుగా ప్రచారం జరుగుతుంది. మంత్రివర్గంలో ఉన్న వారికి అధికారాలు లేవని, నిధులు కూడా లేకపోవటంతో కేవలం అలంకారప్రాయంగా పదవుల్లో కంటిన్యూ అవుతున్నామంటూ కొందరు మంత్రులు తమ సన్నిహితుల వద్ద వాపోతున్నారని ప్రచారం నడుస్తోంది. ఇక ఎమ్మెల్సీ ఎన్నికల కేంద్రంగా నలుగురు ఎమ్మెల్యేలపై వేటు వేయటం కూడా పార్టీలో పరిస్థితులకు అద్దం పడుతుంది. ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత నుంచి కరోనా కాలంలో రెండేళ్లు గడిచిపోవటంతో మెదటి దఫాలో ఉన్న మంత్రులకు మాజీ అనే పేర్లు తప్ప ఏమి మిగలేదంటున్నారు. రెండో దఫాలో మంత్రులు అయిన వారు నిధులు సమస్యతో ఇబ్బందులు పడుతుంటే, ఇప్పుడు మరోసారి క్యాబినేట్ విస్తరణ ద్వారా ఏం లాభమే పెదవి విరుపులు కూడా పార్టీలో ఉన్నాయి. కేవలం సంఖ్యా బలంతో సరిపెట్టే పరిస్థితులు మాత్రమే ఉంటాయా అనే చర్చ రాజకీయ వర్గాల్లో జరుగుతోంది.

# కర్నూలు కొత్త నీరు టెన్షన్

కర్నూలు, ఏప్రిల్ 3, కర్నూలు జిల్లాలో సిట్టింగ్ ఎమ్మెల్యేలకు ఇప్పుడు కొత్త టెన్షన్ పట్టుకుందట. తమను కాదని పార్టీ ఎక్కడ కొత్త వారిని లైన్‌లోకి తీసుకువస్తుందోనని ఆందోళన పడుతున్నారట. మరీ ముఖ్యంగా పీకే సర్వేల్లో గ్రాఫ్ కాస్త అటు ఇటుగా ఉన్న వారికైతే అసలు నిద్రే పట్టడం లేదట. దీనంతటికీ ప్రధాన కారణం కొత్త నీరు, సరికొత్త ప్రయత్నాలు అన్న గుసగుసలు వినిపిస్తున్నాయి.ఉమ్మడి కర్నూలు జిల్లాలో ప్రధాన పార్టీలకు అభ్యర్థుల కొరత లేకున్నా? రాబోయే ఎన్నికల్లో ఆర్థికంగా బలంగా ఉండి సమాజంలో పలుకుబడి ఉన్న వారికోసం ఆరా తీస్తున్నాయట పార్టీలు. ఇప్పటికే ఆయా నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేలు, ఇన్‌ఛార్జులు, మాజీ ఎమ్మెల్యేలు వున్నా? కొత్తగా కొందరికి అవకాశం ఇచ్చే ఆలోచనలో ఉన్నాయట. పార్టీకి ఆర్థికంగా ఉపయోగపడతారనుకున్నవారి గురించి, సామాజిక వర్గాల పరంగా బలంగా ఉన్న తటస్థుల గురించి ఆరా తీస్తున్నాయట పార్టీలు. ఇక? సామాజిక వర్గ బలం, ధనబలం కలిసి ఉన్న వారికైతే జాక్‌పాటేనట. అలాంటి వారిని ఇప్పటికే సంప్రదిస్తున్నారట పార్టీల ముఖ్య నేతలు. ఈ తరహాలో ఉండే.. వెనుకబడిన వర్గాలకు చెందిన వారు, దళితులు, మైనార్టీ సామాజిక వర్గాలకు చెందిన వారి గురించి పార్టీలు అరా తీస్తున్నాయట. మరోవైపు కొందరు ధనవంతులు, వృత్తిపరంగా సక్సెస్ అయి, సమాజంలో గుర్తింపు పొందిన వారు రాజకీయాల్లో ప్రవేశించి అధికార హోదా కోరుకుంటున్న వారు ప్రధాన పార్టీ టికెట్ల కోసం ప్రయత్నిస్తున్నట్టు లోకల్ టాక్. ఇదే ఇప్పుడు పాత నేతల్లో టెన్షన్ పుట్టిస్తోంది.2019 ఎన్నికల్లో వ్యాపారి పోచ బ్రహ్మానంద రెడ్డి నంద్యాల ఎంపీగా, డా.సంజీవ్ కుమార్ కర్నూలు ఎంపీగా , డాక్టర్ సుధాకర్ కోడుమూరు ఎమ్మెల్యేగా, రిటైర్డ్ పోలీస్ అధికారి ఆర్థర్ నందికొట్కూరు ఎమ్మెల్యేగా గెలిచారు. వీరంతా అంతకుముందు రాజకీయాలతో పెద్దగా సంబంధాలు లేనివారే. ఇదే స్ఫూర్తితో 2024 ఎన్నికల కోసం తటస్థుల్లో ఆసక్తి పెరిగిందట. రాజకీయ పార్టీలు కూడా వారిలో డబ్బున్న వారి కోసం చూస్తున్నాయట.ముఖ్యంగా కర్నూలు లోక్‌సభ, అసెంబ్లీ నియోజకవర్గాలకు అభ్యర్థుల కోసం ఎక్కువగా ఆరా తీస్తున్నాయట పార్టీలు. కర్నూలు పార్లమెంట్ నియోజకవర్గానికి బీసీ సామాజిక వర్గానికి చెందిన వారిని, అసెంబ్లీ నియోజకవర్గానికి మైనార్టీల కోసం పార్టీలు చూస్తున్నాయట. కర్నూలు జిల్లాలో ఇద్దరు బీసీ సామాజికవర్గానికి చెందిన వైద్యులు, ఒక మైనార్టీ వైద్యుడితో ఈ తరహా సంప్రదింపులు జరిగాయట.

# నెల్లూరులో మళ్లీ పొలిటికల్ హీట్

నెల్లూరు, ఏప్రిల్ 3,నెల్లూరులో మళ్లీ పొలిటికల్ హీట్ మొదలైంది. ఇప్పటికే జిల్లాకు చెందిన ముగ్గురిపై వైసీపీ సస్పెన్షన్ వేటు వేసింది. మొన్న కోవూరు ఎమ్మెల్యే ప్రసన్న కుమార్ రెడ్డి టీడీపీకి దూరమవుతున్నారనే పుకారు వినపడింది, ఆయన వివరణ ఇచ్చారు. నిన్న మరో ఎమ్మెల్యే మేకపాటి విక్రమె రెడ్డిపై కూడా రూమర్లు వచ్చాయి, ఆయన వాటికి వివరణ ఇచ్చారు. తాజాగా మరో సీనియర్ నేత పేర్నాటి శ్యాంప్రసాద్ రెడ్డి పార్టీ మారుతున్నారనే పుకార్లు వినపడుతున్నాయి. దీనిపై పేర్నాటి వర్గం సుదీర్ఘ వివరణ ఇచ్చింది. తమ నేత పార్టీ మారడంలేదని వైసీపీలోనే ఉంటారంటూ ఆయన అనుచరులు ప్రెస్ నోట్లు విడుదల చేశారు. నాయుడుపేటకు చెందిన వైసీపీ సీనియర్ నేత పేర్నాటి శ్యాంప్రసాద్ రెడ్డి. అన్నీ అనుకున్నట్టు జరిగితే, తూర్పు రాయలసీమ పట్టభద్రుల నియోజకవర్గంలో గెలిచి ఈయన ఎమ్మెల్సీ కావాల్సి ఉంది. కానీ ఇక్కడ టీచర్స్ ఎమ్మెల్సీగా చంద్రశేఖర్ రెడ్డి గెలిచారు, గ్రాడ్యుయేట్స్ ఎమ్మెల్సీనుంచి పోటీ చేసిన శ్యాంప్రసాద్ రెడ్డి ఓడిపోయారు. దీంతో ఆయన కొన్నిరోజులుగా సైలెంట్ గా ఉన్నారు. ఎక్కడా పార్టీ కార్యక్రమాల్లో కనపడటం లేదు. ఓటమి బాధతో ఉన్న ఆయన, పార్టీ కార్యక్రమాలకు కూడా దూరంగా ఉంటున్నారు. ఈ నేపథ్యంలో ఆయనపై పుకార్లు షికార్లు చేస్తున్నాయి. యువగళం పాదయాత్రలో ఉన్న నారా లోకేష్ ని పేర్నాటి శ్యాంప్రసాద్ రెడ్డి కలిశారని వార్తలొస్తున్నాయి. వైసీపీలో ఓటమి చెందిన ఆయన, టీడీపీలోకి వస్తున్నారని, పార్టీలో చేరేందుకు సన్నాహాలు చేసుకుంటున్నారని, అందుకే ఆయన లోకేష్ ని కలిశారని అంటున్నారు. దీంతో వెంటనే పేర్నాటి వర్గం అలర్ట్ అయింది. ఈ వార్తలు ఫేక్ అంటూ వివరణ ఇచ్చింది. అయితే వివరణ నేరుగా పేర్నాటి శ్యాంప్రసాద్ రెడ్డి నుంచి రాలేదు. ఆయన అనుచరుడు రాధాకృష్ణరెడ్డి పేరుతో ఆ వివరణ బయటకు వచ్చింది.

పేర్నాటి శ్యాంప్రసాద్ రెడ్డి ని భ్రష్టు పట్టించేందుకు ఫేక్ న్యూస్ లు పెట్టిస్తున్నారు

వైసీపీ నీ పేర్నాటి శ్యాంప్రసాద్ రెడ్డి వీడే ప్రసక్తే లేదు

టీడీపీలోకి వెళ్ళవలసిన అవసరం పేర్నాటి శ్యాంప్రసాద్ రెడ్డికి లేదు

జగనన్న వెంటే పేర్నాటి

కాకాణి,పేర్నాటిల ను భ్రష్టు పట్టించేందుకు టిడిపినేతల కుట్ర

షోషల్ మీడియా లో వచ్చే ఫేక్ న్యూస్ లు నమ్మద్దు

షోషల్ మీడియా ఫేక్ న్యూస్ లపై రాష్ట్ర పోలీస్ ఇంటెలిజెన్స్ డిపార్ట్మెంట్ కు పిర్యాదు చేస్తున్నాం:- రాధాకృష్ణారెడ్డి

త్వరలోనే అందరి పై కేసులునమోదు చేయిస్తాం

ఎమ్మెల్సీ ఎన్నికలలో కావాలనే ఓడించారనే మనస్థాపం చెంది లోకేష్ ను పేర్నాటి కలిసినట్లు దుష్ప్రచారం చేయడం భావ్యం కాదు

అనంతపురం వెళ్లి రహస్యం గా టీడీపీ యువనాయకుడు లోకేష్ ను కలిసే దౌర్భగ్యం పేర్నాటి కి లేదు

త్వరలోనే మీడియా సమావేశంలో అన్నీ వెల్లడిస్తాం

అంటూ వైసీపీ నేత పాదర్తి రాధాకృష్ణ రెడ్డి మీడియాకు తెలియజేశారు. మొత్తమ్మీద రోజుకో నేతపై పుకార్లు రావడం, వారు మీడియా ముందుకు వచ్చి వివరణ ఇవ్వడం, నెల్లూరులో కామన్ గా మారిపోయింది.

# కిరణ్ కు లాభమా...నష్టమా

తిరుపతి, ఏప్రిల్ 3, ఉమ్మడి ఏపీ మాజీ ముఖ్యమంత్రి నల్లారి కిరణ్ కుమార్ రెడ్డి త్వరలోనే బీజేపీ పార్టీలో చేరతారని మాత్రం ఆయన సన్నిహితులు చెబుతున్నారు. ఆయన చేరికతో పార్టీకి అదనంగా వచ్చే ప్రయోజనం ఏదైనా ఉంటుందా? అన్న చర్చ బీజేపీ జరుగుతుంది. కేవలం రెడ్డి సామాజిక వర్గాన్ని దగ్గరకు తీసుకోవడానికి నల్లారి దగ్గర దారి అనుకున్న కమల దళం ఆయనను పార్టీలోకి తీసుకుంటున్నట్లు కనిపిస్తోంది. కానీ రెండు రాష్ట్రాల్లో అది సాధ్యం అయ్యే పని కాదు. నల్లారి పదేళ్ల తర్వాత మళ్లీ ప్రత్యక్ష రాజకీయాల్లోకి దూకాలని చూస్తున్నారు. అయితే కిరణ్ కుమార్ ఏపీ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా పని చేశారు. ఆ హోదాలో పని చేసిన వ్యక్తి మళ్లీ క్షేత్ర స్థాయి నుంచి రాజకీయం చేయాలంటే కష్టమేనని ప్రజలు చర్చించుకుంటున్నారు. మరో వైపు బీజేపీ ఆంధ్రప్రదేశ్‌లో అధికారంలోకి వచ్చే పరిస్థితి లేదు. అలాంటప్పుడు కమలం కండువా కప్పుకోవడంతో కిరణ్ కు వచ్చే లాభమేమిటని రాజకీయ విశ్లేషకులు ప్రశ్నిస్తున్నారు.నల్లారి కిరణ్ కుమార్ రెడ్డి చేరికతో బీజేపీకి అంతగా లాభం ఉండబోదని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యమంత్రి బాధ్యతలు నిర్వర్తించిన ఇమేజ్ ఓట్లుగా మలుస్తుందా ? అంటే నల్లారి గత పదేళ్లుగా ప్రజలకు ఎందుకు దూరమయ్యారన్న ప్రశ్న వెనువెంటనే వినిపిస్తోంది.నల్లారి కిరణ్ కుమార్ రెడ్డి స్వయంగా ప్రకాశించే నేత కాదు. ఆయన నాయకత్వ లక్షణాలు కేవలం ఒక్క నియోజకవర్గానికే పరిమితం అని చెప్పుకోవాలి. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో పైరవీల కాంగ్రెస్ లో ఆయన అదృష్టవశాత్తూ ముఖ్యమంత్రి అయ్యారు. నిజానికి అప్పుడు కూడా కిరణ్



ఎంపిక సరైంది కాదన్నది పార్టీలో అనేక మంది అభిప్రాయం. తన జీవితంలో చూడలేని పదవిని అనుభవించి, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ చివరి ముఖ్యమంత్రిగా పని చేసే అవకాశం కల్పించిన కాంగ్రెస్ ను కష్టాల్లో వదిలేసి వేరే పార్టీ చూసుకోవడంతోనే నల్లారి కిరణ్ కుమార్ రెడ్డి బలం బయటపడింది. ఆయన పీలేరు నియోజకవర్గానికి ఎక్కువ...చిత్తూరు జిల్లాకు తక్కువస్థాయి నేత అన్న సెటైర్లు ఇప్పటికే సోషల్ మీడియాలో వినిపిస్తున్నాయి.నల్లారి కిరణ్ కుమార్ రెడ్డి సేవలను తెలంగాణలోనూ బీజేపీ ఉపయోగించుకోవాలని భావిస్తుందట.

అదే జరిగితే అంతకు మించి నష్టం మరొకటి ఉండదని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయ పడుతున్నారు. ఏపీ విభజన సమయంలో నల్లారి వ్యవహారాన్ని తెలంగాణ ప్రజలు ఎప్పటికీ మరిచిపోరు. తెలంగాణలో ఆయన ఎంట్రీతో రెడ్డి సామాజికవర్గం ఓట్లను సంపాదించుకోవచ్చని బీజేపీ అధినాయకత్వం అంచనా వేసి ఉండవచ్చు. కానీ సాధ్యం కాదని, కాంగ్రెస్ చీఫ్ రేవంత్ రెడ్డి, వైఎస్సార్ టీపీ చీఫ్ వైఎస్ షర్మిల వైపు మాత్రమే తెలంగాణలో రెడ్డి సామాజికవర్గం మొగ్గు చూపుతుందని రాజకీయ ఉద్ధండుల మాట. కిరణ్ కుమార్ రెడ్డి.. వారి సామాజిక వర్గ నేతగా చూడటం లేదని అంటున్నారు. అలాంటప్పుడు అలాంటప్పుడు నల్లారితో బీజేపీకి కలిగే ప్రయోజనమేమిటనేది ప్రశ్నార్థకం.ఇక ఏపీలో నల్లారి కిరణ్ కుమార్ రెడ్డి వల్ల బీజేపీకి అదనంగా వచ్చే ప్రయోజనం లేదు. ఇక్కడ రెడ్డి సామాజికవర్గం ఓట్లు జగన్ వైపు ఉన్నాయి. అవి టర్న్ అయి నల్లారి వైపు రావడం ఎట్టి పరిస్థితుల్లో ఇప్పుడు మాత్రం జరగదు. దీర్ఘకాలంలో చెప్పలేం కానీ ఇప్పటికిప్పుడు నల్లారి పార్టీలోకి వచ్చినా చేసేదేమీ లేదు. ఏపీలో బీజేపీకి అసలు ఓటు బ్యాంకే లేదు. నల్లారి వల్ల ఓట్లు పెరిగే అవకాశమూ ఎంత మాత్రం లేదు. ఎందుకంటే ఆయన లీడర్ కాదు. అధిష్టానం నిర్ణయించిన నాయకుడు మాత్రమే. అందుకే ఆయన చేరిక బీజేపీకి రెండు రాష్ట్రాల్లో లాభం కాకపోగా, నష్టం జరిగే అవకాశాలే ఎక్కువగా ఉన్నాయని రాజకీయ పండితులు అంటున్నారు. సో.. నల్లారి కిరణ్ కుమార్ రెడ్డి బీజేపీలోకి ఎంట్రీ రాంగ్ టైమింగేనన్నది పలువురి అభిప్రాయం.

# తెలంగాణ రాజకీయ పార్టీల వైపు

## విశాఖ స్టీల్ కార్మికుల చూపు

విశాఖపట్టణం, ఏప్రిల్ 3, విశాఖ స్టీల్ ప్లాంట్ కార్మికులు తమ స్వరాష్ట్రంలోని రాజకీయ పార్టీలపై నమ్మకం పోయింది. ఉండవల్లి అరుణ్ కుమార్ చెప్పినట్లు ఎవరు గెలిచినా ఆంధ్రప్రదేశ్‌లో అన్ని పార్లమెంటు స్థానాలు బీజేపీకే అన్నట్లు... దానికి అనుగుణంగానే వ్యవహరిస్తున్నాయి. దురదృష్టకరమేంటంటే ఏపీలో వైసీపీ, టీడీపీ తప్ప మరో పార్టీ గెలిచే పరిస్థితి గత రెండు ఎన్నికల్లో కన్పించలేదు. పార్లమెంటు స్థానాలతో పాటు శాసనసభలోనూ ఆ రెండు పార్టీలదే ఆధిపత్యం. అయితే విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రయివేటీకరణ చేస్తామని కేంద్ర ప్రభుత్వం పదే పదే ప్రకటిస్తున్నా ఏపీలోని రాజకీయ పార్టీలు మాత్రం నోరు మెదపడం లేదు. అధికార వైసీపీ, విపక్షంలో ఉన్న టీడీపీ, బీజేపీ?కి అలయన్స్‌తో ఉన్న జనసేన కూడా కార్మికుల గోడును పట్టించుకోవడం లేదు. ఏదో రాజకీయంగా అక్కడి గాజువాక స్థానంతో పాటు విశాఖ ఎంపీ పార్లమెంటు స్థానాన్ని గెలుచుకోవడానికి అప్పుడప్పుడు సెంటిమెంట్ ను తమ వైపునకు తిప్పుకోవడానికి తప్ప కేంద్ర ప్రభుత్వంపై ఎలాంటి వత్తిడికి రాజకీయ పార్టీలు దిగడం లేదు. అప్పుడప్పుడు ఆందోళనల్లో పాల్గొన్నా అది కేవలం రాజకీయం కోసమేనన్నట్లు వ్యవహరిస్తున్నాయి. దీంతో కార్మిక సంఘాలకు, కార్మికులకు విసుగెత్తుకొచ్చింది. సున్నితమైన అంశాన్ని కూడా ఏపీ రాజకీయ పార్టీలు పట్టించుకోక పోవడంతో విశాఖ స్టీల్ ప్లాంట్ కార్మికులు విసిగెత్తి పోయారు. కొన్ని వందల రోజుల నుంచి తాము విశాఖ స్టీల్ ప్లాంట్ ను ప్రయివేటీకరించవద్దంటూ ఆందోళన చేస్తున్నా ఏపీ రాజకీయ పార్టీలకు చీమకుట్టినట్లయినా లేదు. పైగా బీజేపీ పెద్దలతో వత్తాసు పలుకుతుండటం వారికి ఆగ్రహం కలిగించింది. దీంతో ఏపీ రాజకీయ పార్టీలపై విశాఖ స్టీల్ ప్లాంట్ కార్మికులకు నమ్మకం పూర్తిగా కోల్పోయినట్లయింది. కమ్యూనిస్టులు ఉన్నా పెద్దగా ప్రభావం చూపించలేని స్థితికి వెళ్లిపోయారు.. దీంతో కేంద్ర ప్రభుత్వంపై వత్తిడి పెంచేందుకు వారంతా తెలంగాణలోని రాజకీయ పార్టీలను ఆశ్రయించారు. తెలంగాణలో కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాడుతున్న బీఆర్ఎస్ పార్టీని ఆశ్రయించారు. దీంతో మంత్రి కేటీఆర్ విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను ప్రయివేటీకరించవద్దంటూ కేంద్ర ప్రభుత్వానికి ఘాటుగా లేఖ రాశారు. బీఆర్ఎస్ తో పాటు కాంగ్రెస్ పార్టీని కూడా వారు ఆశ్రయించారు. టీపీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డిని కలిసి తమకు మద్దతివ్వాలని కోరారు. పార్లమెంటులో తమ సమస్యను ప్రస్తావించాలని కోరారు. ఇక స్టీల్ ప్లాంట్ పరిరక్షణ ఏపీ రాజకీయ పార్టీల వల్ల సాధ్యం కాదని భావించిన కార్మికులు ఇతర రాష్ట్రాల రాజకీయ పార్టీ నేతలను కలుస్తుండం ఏపీ పొలిటికల్ పార్టీలకు తలదించుకోవాల్సిన పరిస్థితిని అని చెప్పక తప్పదు.

# చిన్నారి కిడ్నాప్

నెల్లూరు నెల్లూరు నగరం లోని గుర్రాల మడుగు సంఘంలో ఏడాదిన్నర పాప కిడ్నాప్ కు గురవడం కలకలం రేపింది. సోమవారం తెల్లవారు జామున ఊయలలో ఉన్న పాపను దుండగులు ఎత్తుకెళ్లారు. కిడ్నాపర్లు ఊయలలో బొమ్మను ఉంచి పాపను ఎత్తుకెళ్లినట్లు గుర్తించారు. పాప తల్లిదండ్రులు అనూష, మణికంత పోలీసులకు పిర్యాదు చేసారు. ఈ తెల్లవారుజామున పాపను ఎత్తుకెళ్లినట్లుగా భావిస్తున్నారు.

# ఎమ్మెల్యే ద్వారంపూడి హయాంలో నగర అభివృద్ధి శూన్యం



కాకినాడ, కాకినాడ సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్ రెడ్డి గడిచిన నాలుగేళ్ల కాలంలో నగరంలో చేసిన అభివృద్ధి శూన్యమని తెలుగుదేశం పార్టీ కాకినాడ పార్లమెంట్ మహిళా అధ్యక్షురాలు సుంకర పావని పేర్కొన్నారు. ఈ నాలుగేళ్లలో ఎమ్మెల్యే ద్వారంపూడి రాష్ట్ర ప్రభుత్వం నుంచి ప్రత్యేక నిధులుతో ఎటువంటి అభివృద్ధి చేపట్టలేకపోయారని ఆమె విమర్శించారు. సోమవారం కాకినాడలోని జిల్లా టిడిపి కార్యాలయంలో ఆమె విలేకరులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పావని మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన నవరత్నాలలో భాగంగా మినహా మరెక్కడా రాష్ట్ర ఖజానా నుండి ఎటువంటి నిధులను తీసుకురాలేకపోవడం ఆయన విఫలం చెందారన్నారు. కాకినాడలో చిన్నారులకు ఎంతగానో ఉపయోగంగా ఉండే స్కేటింగ్ స్టేడియం, కాకినాడ కార్పొరేషన్ను కూల్చివేసి మొండి గోడలను అక్కడ మిగిల్చారన్నారు. కాకినాడ నగరపాలక సంస్థకు చెందిన నిధులను

## టిడిపి మహిళా అధ్యక్షురాలు పావని

ఇష్టానుసారంగా ఖర్చు చేయించి కార్పొరేషన్ను దివాలా తీయించారన్నారు. తమ టిడిపి ప్రభుత్వ హయాంలో టిట్కో గృహ సముదాయాన్ని నిర్మిస్తే అది నేటికీ కూడా 1200 మంది లబ్ధిదారులకు అందించడంలో ఎమ్మెల్యే ద్వారంపూడి విఫలం చెందారన్నారు. నగరంలో ఏ ఒక్క మంచి ప్రాజెక్టు పూర్తిచేశారో బహిర్గతం చేయాలని పావని డిమాండ్ చేశారు. కాకినాడ నగరంలోని జయలక్ష్మి కోఆపరేటివ్ సొసైటీ చెందిన ఖాతాదారుల భవిష్యత్తును అతను పట్టించుకోకపోవడంతో మరో ఇదే తరహా కార్తికేయ బిల్డింగ్ సొసైటీ కూడా దివాలా తీసే దశలో ఉందని ఆమె చెప్పారు. ఎమ్మెల్యేగా ఉండి ప్రజలకు ఏం ఉపయోగపడే పనులు చేశారు ఆమె చెప్పాలన్నారు. కాకినాడ నగరంలో పేద ప్రజలకు ఇల్లు ఇచ్చానని చెబుతున్న వైసీపీ నేతలు అది ఎక్కడ ఇచ్చారో ఆ ఇళ్లపై సంతృప్తి చెందామంటూ లబ్ధిదారులతో చెప్పించగలరా అని పావని ప్రశ్నించారు. కాకినాడ నగరంలో అన్యాయాలు, అక్రమాలు, భూకబ్జాలు, అరాచకాలు పెరిగిపోయాయని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. చెత్త పన్ను నగర ప్రజల నుంచి పీడించి వసూలు చేసి పారిశుద్ధ్యం, దోమల నివారణపై ఎటువంటి చర్యలను ఎమ్మెల్యే ద్వారంపూడి చేపట్టలేక పోయారన్నారు. స్థానిక జగన్నాధపురం లోని ఎన్టీఆర్ వారధి కుంగిపోతే ఆ నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం నుంచి నిధులు తీసుకురాకుండా కార్పోరేషన్ ఖజానా సొమ్మును నిధులను వినియోగించడం వల్ల కార్పొరేషన్ దివాలా తీసిందని దీనికి ఎమ్మెల్యే ద్వారంపూడి వైఖరియే కారణమని పావని చెప్పారు. ఈ సమావేశంలో టిడిపి నాయకులు చాపల లీలా ప్రశాంతి, మహిళా నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# గన్ లైసెన్సులపై అసత్య ప్రచారం చేసేవారిపై చర్యలు

## 2019 సం. నుండి 2023 సం వరకూ 159 గన్ లైసెన్సులు మంజూరు

## 70 శాతం ఏ.టి.ఎం ల క్యాష్ లోడింగ్ కు, ఇండస్ట్రియల్ సెక్యూరిటీ, బ్యాంకుల భద్రతకు ఇచ్చినవే

## జిల్లా ఎస్.పి కే.కే.ఎన్ అన్బురాజన్

కడప ఏప్రిల్ 3: జిల్లాలో గన్ లైసెన్సులపై అవాస్తవాలు, అసత్య ప్రచారం చేసేవారిపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్.పి కే.కే.ఎన్ అన్బురాజన్ హెచ్చరించారు. ఈ మేరకు జిల్లా ఎస్.పి సోమవారం పత్రికా ప్రకటన విడుదల చేశారు. 2014 నుండి 2019 సం. వరకూ జిల్లాలో 117 లైసెన్సులు మంజూరు చేయగా, 2019 సం. నుండి 2023 వరకూ 159 లైసెన్సులు మంజూరు చేయడం జరిగిందని, ఇందులో 70 శాతం లైసెన్సులు ఏ.టి.ఎం ల క్యాష్ లోడింగ్ కు, ఇండస్ట్రియల్ సెక్యూరిటీ, బ్యాంకుల భద్రతలో భాగంగా ట్రైన్డ్ సెక్యూరిటీ గార్డ్స్ కు ఇచ్చినవేనని వెల్లడించారు. గత పదేళ్లలో మొత్తం 276 లైసెన్సులు మంజూరు చేయడం జరిగిందన్నారు. అవాస్తవాలు ప్రచారం చేసేవారిపై లీగల్ ఒపీనియన్ తీసుకుని చట్టప్రకారం చర్యలు తగీసుకుంటామని అయన హెచ్చరించారు.

# అనకాపల్లి లో వైసీపీ కి ఎదురుదెబ్బ

అనకాపల్లి అనకాపల్లి నియోజకవర్గం అనకాపల్లి మండలం లో మేజర్ పంచాయతీ అయిన తుమ్మపాలకు చెందిన వైసీపీ ముఖ్య నాయకులు పల్లెల గణేష్ పవన్ కళ్యాణ్ సిద్ధాంతాలు నచ్చి తన 70 మంది అనుచరులతో జనసేన పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి, అనకాపల్లి నియోజకవర్గం ఇంచార్జ్ పరుచూరి భాస్కరరావు సమక్షంలో జనసేన పార్టీ లోకి చేరారు. భాస్కరరావు వారికి జనసేన కండువాలు కప్పి పార్టీ లోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా భాస్కరరావు మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రస్తుత రాజకీయాల్లో మార్పు కేవలం పవన్ కళ్యాణ్ తోనే సాధ్యం అని అన్నారు. రాష్ట్రంలో తన సొంత డబ్బుతో ప్రజలకు సేవ చేస్తున్న ఏకైక నాయకుడు పవన్ కళ్యాణ్ అని పేర్కొన్నారు. జనసైనికుల సమిష్టి కృషితో అనకాపల్లి లో మరియు రాష్ట్రంలో జనసేన జెండా తప్పకుండా ఎగురుతుంది అని అన్నారు. అనంతరం పల్లెల గణేష్ మాట్లాడుతూ పవన్ కళ్యాణ్ సిద్ధాంతాలు తమను ఎంతో ఆకర్షించాయి అని అన్నారు. అనకాపల్లి లో జనసేన పార్టీ ని గెలిపించి భాస్కరరావు ని అసెంబ్లీ కి పంపించేందుకు తాము అందరం కృషి చేస్తాము అని అన్నారు.

# శ్రీవారి సేవలో జాహ్నవి కపూర్..



తిరుమల తిరుమల శ్రీవారిని పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు.. సోమవారం ఉదయం స్వామి వారి నైవేద్య విరామ సమయంలో బాలీవుడ్ నటీ జాహ్నవి కపూర్,మాజీ కేంద్ర మంత్రి సర్వే సత్యనారాయణ, టిటిడి మాజీ పాలక మండలి సభ్యులు ఓవీ.రమణలు వేర్వేరుగా స్వామి వారి సేవలో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. దర్శనంతరం వీరికి ఆలయ రంగనాయకుల మండపంలో వేద పండితులు వేద ఆశీర్వాదం అందించగా, ఆలయ అధికారులు పట్టు వస్త్రంతో సత్కరించి స్వామి వారి తీర్థ ప్రసాదాలు అందజేశారు.. ఆలయం వెలుపలకు వచ్చిన జాహ్నవి కపూర్ తో ఫోటోలు దిగేందుకు అభిమానులు ఉత్సాహం చూపారు..

# ప్రజా వ్యతిరేక విధానాలపై ఏప్రిల్ 14 నుంచి 30 వరకు వామపక్షాల ప్రచారం



కాకినాడ, ఏప్రిల్ 3 కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అందిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈ నెల 14వ తేదీ నుంచి 30 వరకు గ్రామ గ్రామాల్లో ఉభయ వామపక్షాల (సిపిఐ, సిపిఎం) ఆధ్వర్యంలో ప్రచార కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు తాటిపాక మధు, సిపిఎం జిల్లా కన్వీనర్ ఎం రాజశేఖర్లు తెలిపారు. రాష్ట్రానికి కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అన్యాయం చేస్తున్నా, ఇచ్చిన హామీలను నెరవేర్చక పోతున్నా దాన్ని ప్రశ్నించలేని స్థితిలో రాష్ట్రంలోని వైకాపా, టిడిపి, జనసేన పార్టీలు ఉన్నాయని వారు చెప్పారు. సోమవారం కాకినాడ నగరంలోని జిల్లా సిపిఐ కార్యాలయంలో వామపక్ష పార్టీలకు చెందిన నేతలు విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తాటిపాక మధు, ఎం రాజశేఖర్లు మాట్లాడుతూ దేశంలో జాతీయ రాజకీయాల్లో ప్రమాదకరమైన ధోరణిలు కనిపిస్తున్నాయన్నారు మోడీ ప్రధానమంత్రి ఆయన తరువాత తొలిసారిగా పార్లమెంట్లను ముద్దు పెట్టుకుని ప్రజాస్వామ్యాన్ని పరిరక్షత్వాన్ని దేశంలో భారత రాజ్యాంగాన్ని గౌరవిస్తానని చెప్పిన దాన్ని పాటించడంలో విఫలమయ్యారన్నారు పైగా దేశ సంపదను కార్పొరేట్ రంగాలకు దారాదత్తం చేసి పేదలపై భారాలు మోపుతున్నారన్నారు. ఈ విధానాలను నిరసిస్తూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై అంబేద్కర్ జయంతి ఏప్రిల్ 14 నుంచి 30 వరకు చైతన్య కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. మోదీ రాజ్యాంగాన్ని, పార్లమెంట్‌ను పూర్తిగా అగౌరవపరిచారని పేర్కొన్నారు. ప్రపంచం మొత్తం అదానీ కుంభకోణం

## రాష్ట్రానికి అన్యాయం చేస్తున్నా వ్యతిరేకించని స్థితిలో వైకాపా, టిడిపి, జనసేనలు

గురించి చర్చించుకుంటున్నా మోదీ ఒక్క మాట కూడా మాట్లాడలేదని ఆరోపించారు. అదానీ ఎపిసోడ్‌పై జాయింట్ పార్లమెంటరీ కమిటీని వేయాలన్న డిమాండ్‌పై కేంద్ర ప్రభుత్వం స్పందించలేదని పేర్కొన్నారు. ఓ పక్క నిత్యవసర, గ్యాస్ ధరలు పెరుగుతున్న కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పట్టించుకోవడంలేదన్నారు. అదేవిధంగా పోలవరం ప్రాజెక్టు ఎత్తును తగ్గించేందుకు కేంద్ర ప్రభుత్వం కుట్ర చేస్తుందన్నారు. అదేవిధంగా విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేట్ ఆపేందుకు సీఎం జగన్ ప్రయత్నించకపోవడం దారుణమని పేర్కొన్నారు. అసెంబ్లీ సమావేశాలు జరుగుతున్న మధ్యలో ఢిల్లీకి సీఎం జగన్ వెళ్లారని ఎందుకు వెళ్లారో కూడా నేటికి బహిర్గతం చేయలేదని మధు, రాజశేఖర్లు చెప్పారు. ఈ సమావేశంలో సిపిఐ కాకినాడ జిల్లా కార్యదర్శి కె బోడకొండ, సిపిఎం నాయకులు కె వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

# రేషన్... గిరిజన బతుకుల్లో పరేషాన్

## అవస్థలు పడుతున్న గిరిజనులు

అల్లూరి సీతారామరాజు అరకులోయ మండలంలోని శిరగం పంచాయతీ కోడిపుంజు వలస గ్రామానికి చెందిన ఐదు గిరిజన కుటుంబాలు సుమారు మూడు సంవత్సరాలుగా రేషన్ సరుకులు అందక నానా అవస్థలు పడుతున్నారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మూడు సంవత్సరాలు గా రేషన్ సరుకులు నిలిపి వేయడంతో అర్ధాకలితో పస్తులు ఉంటున్నామని ఉపాధి కూలీ లేక పిల్ల పాపలతో అలమటిస్తున్నామని వాపోయారు అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ రేషన్ సరుకులు ఇస్తున్నామని ప్రభుత్వం చెబుతున్న కేవలం అవి ప్రచారాల వరకే పరిమితమని గిరిజనులు ఆరోపిస్తున్నారు తమకు ఎలాంటి ప్రయోజనం లేదని గిరిజనులు ఆందోళన చెందుతున్నారు రేషన్ కార్డులు ఉన్నాయని అయితే ప్రభుత్వం జారీ చేసిన రైస్ కార్డులు రాకపోవడంతో రేషన్ బియ్యాన్ని మధ్యలోనే నిలిపివేశారన్నారు గతంలో రేషన్ సరుకులు ఇచ్చేవారని ఇప్పుడు ఇతరాత్ర కారణాలు చూపి రేషన్ బియ్యాన్ని నిలిపివేయడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని తెలిపారు తమకు ఇంతలా ఇబ్బందులకు గురి చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు సంబంధిత అధికారులకు తెలియజేసిన పట్టించుకోవడంలేదని వాపోతున్నారు పంచాయతీ వీఆర్వో ను వివరణ కోరగా నా దృష్టికి ఎప్పుడు రాలేదని అర్హత కలిగిన ప్రతి ఒక్కరికి రేషన్ సరుకులు అందేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు ఇప్పటికైనా ఉన్నత అధికారులు స్పందించి రేషన్ బియ్యం అందేలా చర్యలు తీసుకోవాలని గిరిజనులు వేడుకొంటున్నారు.

# 10వ తరగతి పరీక్ష పేపర్ లీక్

తాండూరు వికారాబాద్ జిల్లా తాండూరు పట్టణంలో ఎంతో పకడ్బందీగా నిర్వహించవలసిన పదో తరగతి వార్షిక పరీక్షల పేపర్ వికారాబాద్ జిల్లా తాండూర్ వాట్సాప్ సోషల్ మీడియా గ్రూపులలో ముందే చెక్కర్లు కొట్టింది. ఉదయం 9:37కే వాట్సాప్ గ్రూప్ లలో వచ్చింది. ఈ విషయంపై అధికారులకు సమాచారం ఇచ్చిన పేపర్ మనది కాదని బుకాయించారు. మరోవైపు పరీక్ష సమయం అయిపోయిన తర్వాత 12 గంటల 30 నిమిషాలకు బయటకు వచ్చిన విద్యార్థుల దగ్గర పేపర్ చూడగా ఆ పేపర్ ఈ పేపర్ ఒకటే విధంగా ఉన్నట్టుగా తెలిసింది. దీంతో ముందుగానే పదో తరగతి పరీక్ష పేపర్ లీక్ అయిందని వెలుగులోకి రావడం జరిగింది. పేపర్ లీకేజీకి కారకులు ఎవరనేది విషయం విశ్వాసనీయ సమాచారం మేరకు తాను పట్టణం ప్రభుత్వ నెంబర్ వన్ పాఠశాలలో ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్న బందెప్ప వాట్సాప్ గ్రూప్ లలో షేర్ చేసినట్టు విశ్వసనీయ సమాచారం. తాండూర్ ఎంఈఓ వెంకటయ్య ప్రధానోపాధ్యాయుడిగా ఉన్న పాఠశాలలోనే పదవ తరగతి పేపర్ లీకేజీ కావడం గమనార్హం.

# మా ఆస్తులకు మాకు రక్షణ కల్పించండి

అనకాపల్లి చిన్న పిల్లల వైద్యనిపుణులు ఉమామహేశ్వరరావు వితంతువు మాదాబత్తుల నాగరత్నం న్యాయవాది దొమ్మేటి రవితేజ పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని తమకు న్యాయం జరిపించాలని కోరుతూప్రముఖ చిన్నపిల్లల వైద్య నిపుణులు లేట్ ఉమా మహేశ్వరరావు భార్య మాదాబత్తుల నాగరత్నం సోమవారం ఎస్పీ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. తనను తన కుమారులను మానసికంగా భయభ్రాంతులను చేస్తున్న న్యాయవాది దొమ్మేటి రవితేజ పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని తమకు న్యాయం జరిపించాలని కోరుతూ తనను తన కుమారులను మానసికంగా భయభ్రాంతులను చేస్తున్న న్యాయవాది దొమ్మేటి రవితేజ పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని తమకు న్యాయం జరిపించాలని కోరారు. ఈ సందర్భంగా నాగరత్నం, ఆమె రెండవ కుమారుడు సాయి శ్రీ శశాంక్ మాట్లాడుతూ 2020 కరోనా సమయంలో తన భర్త డాక్టర్ ఉమామహేశ్వరరావు కరోనా బారిన పడి మరణించారన్నారు. తన కుమారులు ఇద్దరు ఒకరు వైజాగ్ లో ఉద్యోగం చేస్తూ మరొకరు ఎంబిబిఎస్ చదువుతున్నారని వారు దగ్గర లేకపోవడం, నా భర్త పోయిన మనోవ్యాధిలో

## మోసగాడు దొమ్మేటి రవితేజ పై చట్టపరమైన చర్యలు తీసుకోండి

నేను ఉండటం జరిగిందన్నారు. ఆ సమయంలో అమరావతి హైకోర్టులో న్యాయవాదిగా పనిచేస్తున్నానంటూ మీకు మీ ఆస్తులకు ప్రస్తుతం రక్షణ లేదని మీకు ప్రాణహాని ఉందని నేను మీకు అండగా ఉంటానని దొమ్మేటి రవితేజ అన్న వ్యక్తి పరిచయం చేసుకొని తనను నమ్మించాడని అన్నారు. ఆ నమ్మకంతో ఉన్నప్పుడే గొలగంలో నాలుగు కోట్ల రూపాయలు విలువ గల స్థలాన్ని ఇతరులు కాజేసే ప్రయత్నం చేస్తున్నారని తమ పేరు మీద రాస్తే ఆ సమస్యలు పరిష్కారం అయిన తర్వాత తిరిగి మీ పేరు మీద వ్రాసేస్తా అని నమ్మ పలకడంతో అతని పేరుపై రాశానని అన్నారు. అయితే అతడు మోసగాడు అని తెలుసుకోవడం వలన నా పిల్లలు ప్రశ్నిస్తే నా రెండవ కుమారుడు పై తిరిగి ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు, రేప్ కేసు పెట్టారని అన్నారు. రవితేజ అన్న వ్యక్తి వల్ల చాలా డబ్బు నష్టపోయామని మాకు న్యాయం చేసి మాకు రక్షణ కల్పించాలని పోలీసేలను కోరారు.

# పోలీసు స్పందనకు 75 ఫిర్యాదులు .



నంద్యాల మా ప్రతినిధి (విబారే న్యూస్..) నంద్యాల జిల్లా బొమ్మల సత్రం వద్ద గల జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమంలో ఫిర్యాదిదారుల నుంచి నంద్యాల జిల్లా ఎస్పీ శ్రీ కె.రఘువీర్ రెడ్డి 75 ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా నలుమూలల నుండీ విచ్చేసిన ఫిర్యాదిదారుల సమస్యలను జిల్లా ఎస్పీ అడిగి తెలుసుకుని

**జిల్లా ఎస్పీ. శ్రీ కె.రఘువీర్ రెడ్డి.**

సంబంధిత అధికారులతో స్వయంగా ఫోన్ లో మాట్లాడి చట్టపరిధిలో ఫిర్యాదిదారుల సమస్యలను సత్వరమే పరిష్కరించాలని ఆదేశించారు .చట్ట పరిధిలో చట్టపరంగా ఉన్న సమస్యలకు తక్షణమే పరిష్కారం చూపాలని ,స్పందన ఫిర్యాదులను మళ్ళీ పునరావృతం కాకుండా చూడాలని ,స్పందన పిర్యదుల పట్ల నిర్లక్ష్యం గా వ్యవహరించరాదని సంబంధిత పోలీసు అధికారులతో ఫోన్ లో మాట్లాడి పరిష్కారం చూపాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎక్కువగా సివిల్ తగాదాలు, అన్నదమ్ముల మధ్య ఆస్తి తగాదాలు, కుటుంబ కలహాలు ,అత్తరింటి వేదింపులు మొదలగు ఫిర్యాదులు ఉన్నాయి. ఫిర్యాదుల పై అధికారులు తీసుకున్న చర్యలను జిల్లా కార్యాలయానికి ఎప్పటికప్పుడు సమాచారం అందించాలని మరియు ప్రతి సోమవారం ప్రతి పోలీసు స్టేషన్ ,సర్కల్ ఆఫీసు,డిఎస్పి ఆఫీసులలో స్పందన కార్యక్రమం నిర్వహించి జిల్లా పోలీసు కార్యాలయానికి సంబందిత సమాచారం అందించాలని జిల్లా ఎస్పీ గారు తెలియజేశారు. నంద్యాల జిల్లా ఎస్పీ గారు స్పందకు వచ్చిన ఫిర్యాదిదారులకు ఓంకారం ధేవస్థానం వారిచే భోజన వసతి ఏర్పాటు చేసినారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ గారితో పాటు స్పెషల్ బ్రాంచ్ సిఐ దస్తగిరిబాబు పాల్గొన్నారు.

# స్పందన వినతులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోండి




నంద్యాల, ఏప్రిల్ 03:- (విబారే న్యూస్..) రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా స్పందన కార్యక్రమాన్ని నిర్వహిస్తోందని స్పందన కార్యక్రమంలో వచ్చిన అర్జీలపై ప్రత్యేక శ్రద్ధ తీసుకొని గడువులోగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ డా.మనజిర్ జిలాని సమూన్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్లోని వైయస్సార్ సెంటినరీ హాలులో ప్రజా సమస్యల పరిష్కార వేదిక స్పందన కార్యక్రమంలో కలెక్టర్ తో పాటు జిల్లా జాయింట్ కలెక్టర్ నిశాంతి.టి, డిఆర్ఓ పుల్లయ్య, జిల్లా పరిషత్

**అధికారులను ఆదేశించిన జిల్లా కలెక్టర్ మరియు జాయింట్ కలెక్టర్ నిశాంతి.టి**

డిప్యూటీ సిఇఓ సుబ్బారెడ్డి, డిఆర్డిఏపిడి శ్రీధర్ రెడ్డి, ఇతర జిల్లా ఉన్నతాధికారులు ప్రజల నుంచి వచ్చిన దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ డా.మనజిర్ జిలాని సమూన్ మాట్లాడుతూ స్పందన అర్జీలపై జాప్యం లేకుండా ప్రత్యేక శ్రద్ధ తీసుకొని గడువులోగా పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ×జాయింట్ కలెక్టర్ నిశాంతి.టి మాట్లాడుతూ... స్పందన కార్యక్రమం ద్వారా స్వీకరించిన దరఖాస్తులపై ప్రత్యేక దృష్టి సారించి నాణ్యతతో పరిష్కరించాలని ఏ ఒక్క దరఖాస్తు బియాండ్ ఎస్ ఎల్ ఏలోకి వెళ్లకుండా చూడాలన్నారు. బియాండ్ ఎస్ఎల్ఏలోని దరఖాస్తులన్నింటినీ వేగంగా గడువులోగా పరిష్కరించాలని పరిష్కారంకాని సమస్యలకు సరైన ఎండార్స్మెంట్ ఇచ్చి క్లోజ్ చేయాలన్నారు. లేని పక్షంలో మళ్లీ అవే సమస్యలు తిరిగి పునరావృతమయ్యే అవకాశముందన్నారు. పరిష్కార నివేదికలో అర్జీదారులకు అర్థమయ్యే విధంగా పూర్తి వివరాలతో ఎండార్స్మెంట్ ఇవ్వాలన్నారు. స్పందన కార్యక్రమంలో ప్రతి అర్జీని బాధ్యతగా తీసుకుని పరిష్కరించే కోణంలో ఆలోచించాలన్నారు. సోమవారం స్పందన కార్యక్రమంలో వచ్చిన అర్జీలను త్వరితగతిన క్లియర్ అయ్యేటట్లు చూడాలన్నారు. జిల్లా నలుమూలల నుంచి ప్రజలు ఎన్నో వ్యయప్రయాసలకోర్చి తమ సమస్యల పరిష్కారం కోసం స్పందన కార్యక్రమానికి వస్తుంటారని అధికారులు బాధితుల సమస్యలను గుర్తించి పరిష్కరించాలన్నారు.(1) గడివేముల మండలం, గడివేముల గ్రామానికి చెందిన వి.జంబులు సర్వే నెంబర్ 99 లో 4.5 ఎకరాల తన భూమి ఇతరులు ఆక్రమించుకున్నారని ఈ సమస్యపై విచారణ జరిపి తమకు న్యాయం చేయాలని స్పందన కార్యక్రమంలో అర్జీ సమర్పించారు.(2)దొర్నిపాడు మండలం, దొర్నిపాడు గ్రామానికి చెందిన గాజులనాగమ్మ సర్వే నెంబర్ 932/2 లో 95 సెంట్ల తన భూమి ఆన్లైన్ చేసి పాసుబుక్కులు మంజూరు చేయాలని స్పందనలో అర్జీ సమర్పించారు.(3) పగిడాల మండలం, లక్ష్మీపురం గ్రామానికి చెందిన బి.ఎల్లప్ప సర్వేనెంబర్ 374/7 లో 2.56 ఎకరాల భూమి సర్వే చేసి హద్దులు చూపించాలని స్పందన కార్యక్రమంలో అర్జీ సమర్పించారు.(4) కోవెలకుంట్ల మండలం, కోవెలకుంట్ల గ్రామానికి చెందిన జడల వెంకటన్న తాను ఇంటర్ వరకు చదివి ఖాళీగా ఉన్నానని ఎస్సీ కార్పొరేషన్ ద్వారా రుణం మంజూరు చేయించాలని స్పందన కార్యక్రమంలో అర్జీ సమర్పించారు. ఇంకా ఈ కార్యక్రమంలో ప్రజలు వివిధ సమస్యలపై 145 అర్జీలు సమర్పించారు. ఈ సమస్యలన్నీ వెంటనే పరిష్కరించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ నిశాంతి సంబంధిత అధికారులకు ఎండార్స్ చేస్తూ ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# జిల్లా ఐ ఎన్ టి యు సి నుండి ఎం సుంకన్న తొలగింపు

కర్నూల్ ప్రతినిధి....... విబారే న్యూస్....అఖిలభారత కాంగ్రెస్ పార్టీ అనుబంధ సంస్థ అయిన ఐ ఎన్ టి యు సి ట్రేడ్ యూనియన్ ఈరోజు ఐ ఎన్ టి యు సి జిల్లా ఆఫీసు నందు సర్వసభ్య సమావేశం జరిగినది ఈ సర్వసభ్య సమావేశంలో ఐఎన్టీయూసీ కార్యక్రమాల గురించి చర్చించడం జరిగినది. అదేవిధంగా ఐ ఎన్ టి యు సి ప్రధాన కార్యదర్శి అయిన ఎం సుంకన్న గారికి గత నెల 21వ తారీఖున క్రితం ఐ ఎన్ టి సి కమిటీకి వ్యతిరేకముగా నడుసుకొనుచున్నాడు కాబట్టి శోకాజ్ నోటీసు ఇవ్వడం జరిగింది అది ఈనెల రెండవ తారీకు లోపల సంజాయిషీ కమిటీకి చెప్పుకోవాలని కమిటీ నిర్ణయించి సుంకన్న గారికి నోటీసు పంపడం జరిగింది. కమిటీకి ఇంతవరకు ఎలాంటి సంజాయిషీ చెప్పలేదు కాబట్టి ఆయనకు ఇచ్చిన తేదీ ఈ నెల రెండవ తారీకు నాటికి అయిపోయినది ఈరోజు మూడో తేదీ. గత నెల23వ తేదీ సర్వసభ సమావేశం లో ఐ ఎన్ టి యు సి ఆఫీసు నందు జరిగింది. ఈ సమావేశంలో ప్రధాన కార్యదర్శి సుంకన్న విషయము చర్చించడం జరిగినది. ఆ చర్చలో సుంకన్న పాల్గొని నీవు నాకు ఎలా నోటీసు ఇస్తావు నీవు నోటీసు ఇస్తే నేను కూడా నీకు అదే విధంగా నోటీసు పంపినాను. నేను నీకు సంజాయిషి చెప్పుకొనే అవసరం లేదు మీకు ఐఎన్టీయూసీ ప్రధాన కార్యదర్శిని నన్ను తీసేసే అధికారము లేదు అని కమిటీ ముందర అన్నాడు అయితే కమిటీ సభ్యులంతా కలిసి ఆ విధంగా మాట్లాడకూడదు నీ మాదిరే ఇంకొకరు మాట్లాడితే ఈ సంఘం విచ్ఛిన్నం అయిపోతది కాబట్టి ఈమాటలు అన్నిటిని బట్టి జిల్లా కమిటీ నిర్ణయము తీసుకుంది సుంకన్న అనే వ్యక్తి అందరికి కమిటీకి వ్యతిరేకంగా ఉంటూ అధ్యక్షునికే గౌరవం లేనట్లు మాట్లాడుచున్నాడు కాబట్టి ఐఎన్టియుసి పదవి నుండి తొలగిస్తున్నాము ఈరోజు నుండి అనగా 3/4/23 నుంచి ఐ ఎన్ టి యు సి సంఘము నుండి తొలగించడం జరిగింది. ఇకనుండి ఐఎన్టియుసికి ఎలాంటి సంబంధము లేదు. జిల్లా అధ్యక్షులు బి . బతుకన్నజిల్లా గౌరవ సలహాదారుడు అమరేంద్ర రెడ్డి జిల్లా అడ్వాకెటే తిక్క స్వామి జిల్లా ట్రెజరర్ కె .ఆనందం జిల్లా ప్రధాన కార్యదర్శి మహేష్ జిల్లా వైస్ ప్రెసిడెంట్ జేమ్స్ ఆశీర్వాదం కర్నూలు నియోజకవర్గ ఇంచార్జి రాజేంద్ర ప్రసాద్ కోడుమూరు నియోజకవర్గ ఇంచార్జి ప్రతాప్ జిల్లా కార్యదర్శులు మద్దిలేట్టి , గిరి , రామచంద్రయ్య , ప్రతాప్ బి . హుస్సేన్ , పౌల్ , దేవరాజ్ , చిన్న యేసు . తదితరులు పాల్గొన్నారు

# రైతులకు నవధాన్యాల కిట్ల పంపిణి



నంద్యాల మా ప్రతినిధి (విబారే న్యూస్..) సోమవారం నంద్యాల జిల్లా పాణ్యం మండలం మహిళా మండల సమాఖ్య ఆఫీసు లో ప్రకృతి వ్యవసాయ రీజినల్ కోఆర్డినేటర్ చంద్రశేఖర్ జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ నరేంద్ర రెడ్డి ఆధ్వర్యంలో లో నవధాన్యాల కిట్స్ తయారీ మరియు నవధాన్యాల సాగు పై అవగాహనా కార్యక్రమం నిర్వహించారు, వారు మాట్లాడుతూ భూమి లో సేంద్రియ కర్బణం పెరగాలంటే అన్ని జాతుల 30 రకాల నవధాన్యా విత్తనాలు ఎకరాకు 13 కిలోలు విత్తన గుళికలు చేసి సాగుచేసుకోవాలని తద్వారా జీవ వైవిధ్యం పెరుగుతుంది, స్తుల మరియు సూక్ష్మ పోషకాలు లభించును, చీడపిడాలు తెగుళ్లను తట్టుకునే సామర్థ్యం పెరుగుతుంది, నీటి నిల్వ సామర్థ్యం పెరుగుతుంది భూసారం పెరిగి ప్రధాన పంటకు, భూమికి కావలసినటువంటి అన్ని రకాల పోషకాలు అందుతాయని తద్వారా పంటలలో అధిక దిగుబడులు సాధించవచ్చని తెలియచేసారు కావున పాణ్యం మండలం లో ఉన్న రైతులందరు కూడా నవధాన్యాలు సాగు చేసుకొని అధిక దిగుబడులు సాధించాలని తెలియచేశారు, అనంతరం రైతులకు నవధాన్యాల కిట్లు అందజేశారుఈ కార్యక్రమం లో రైతులు,పాణ్యం మండలం హుసేన్ బీ, -3 ఎంం మునేశ్వరి అడిషనల్ ఆఖఓ సలాం,వెలుగు ప్రసాద్,ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొనడం జరిగింది.


# దారుణం.. తోటి ప్రయాణికురాలిపై పెట్రోల్‌పోసి నిప్పంటించిన వ్యక్తి.. ముగ్గురు మృతి



కేరళ లో దారుణ ఘటన చోటుచేసుకుంది. కోజికోడ్ జిల్లా ఎలత్తూర్ సమీపంలో కదులుతున్న రైలు లో తోటి ప్రయాణికురాలిపై ఓ వ్యక్తి పెట్రోల్ పోసి నిప్పంటించాడు. ఈ దారుణ ఘటనలో ముగ్గురు ప్రాణాలు కోల్పోగా.. 8 మంది తీవ్రంగా గాయపడ్డారు. రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..అలప్పుళ-కన్నూర్ ఎగ్జిక్యూటివ్ ఎక్స్‌ప్రెస్ రైలు లో ఆదివారం రాత్రి 10గంటల ప్రాంతంలో ఈ ఘటన చోటు చేసుకుంది. రైలు కోజికోడ్ నగరం దాటి కోరపుజ రైల్వే వంతెన వద్ద కు చేరుకోగానే డీ1 కంపార్ట్‌మెంట్‌లోని ఓ గుర్తు తెలియని వ్యక్తి తోటి ప్రయాణికురాలిపై పెట్రోల్ పోసి నిప్పంటించాడు. వెంటనే మంటలు తోటి ప్రయాణికులకు అంటుకున్నాయి. ఈ ప్రమాదంలో ఎనిమిది మంది తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటనతో భయాందోళనకు గురైన తోటి ప్రయాణికులు వెంటనే రైల్వే పోలీసులకు సమాచారం అందించారు. ఘటనాస్థలికి చేరుకున్న రైల్వే పోలీసులు క్షతగాత్రులను సమీపంలోని ఆసుపత్రికి తరలించారు. అయితే ఈ ఘటన తర్వాత రైల్లో నుంచి ముగ్గురు ప్రయాణికులు కనిపించలేదని తోటివారు గుర్తించారు. వారి కోసం గాలింపు చేపట్టగా ఘటన జరిగిన సుమారు 100 మీటర్ల దూరంలోని రైల్వే ట్రాక్‌పై వారి మృతదేహాలు కన్పించాయి.

## విడిపోయిన అన్నదమ్ములను కలిపిన బలగం

నిర్మల్,ఏప్రిల్3: భూమి తగాదాలతో విడిపోయిన ఇద్దరు అన్నదమ్ములను బలగం చిత్రం కలిపింది. ఈ ఘటన నిర్మల్ జిల్లాలో చోటుచేసుకుంది. నిర్మల్ జిల్లా లక్ష్మణచాందకు చెందిన అన్నదమ్ములు గుర్రం పోసులు, రవి ఓ స్థలం వివాదంలో గొడవపడి చాలా కాలం క్రితం విడిపోయారు. అయితే ఇటీవల వారి గ్రామానికి చెందిన సర్పంచ్ సురకంటి ముత్యంరెడ్డి చొరవతో మండల కేంద్రంలోని డీఎన్ఆర్ ఫంక్షనల్ హాల్‌లో బలగం సినిమాను ఉచితంగా ప్రదర్శించారు. ఈ చిత్రాన్ని చూసిన పోసులు, రవి తమ మనసును మార్చుకున్నారు. తమ మనస్పర్థాలు పక్కనపె ట్టామని, ఇకనుంచీ కలిసే ఉంటామని ఆదివారం ఉదయం సర్పంచ్ ముత్యంరెడ్డి సమక్షంలో ఒక్కటయ్యారు. వివాదంలో ఉన్న భూమి సమస్యను పరిష్కరించుకున్నారు. తమను కలిపిన గ్రామ సర్పంచ్ కు కృతజ్ఞతలు తెలిపారు. అన్నదమ్ముల్లో మార్పు రావడం చూసి గ్రామ సర్పంచ్ బలగం సినిమా చిత్ర యూనిట్‌కి అభినందనలు తెలిపారు. ప్రస్తుతం ఈ వార్త సోషల్ మీడియాలో వైరల్ గా మారింది.






# నానికి ఇప్పుడే అసలు సినిమా మొదలైంది..!




దసరా హిట్ తో నాని తన రేంజ్ ఇది అని చూపించాడు. 15 ఏళ్ల కెరీర్ లో ఇప్పటికీ టైర్ 2 హీరోగానే ఉన్న నాని దసరాతో తన సత్తా చూపించాడు. సినిమాకు అతను పడిన కష్టం.. రిలీజ్ టైం లో చేసిన ప్రమోషన్స్ నానికి వసూళ్ల రూపంలో వస్తున్నాయి. కొత్త దర్శకుడు శ్రీకాంత్ ని నమ్మి నాని ఇంత రిస్క్ చేయడం గురించి ప్రత్యేకంగా చెప్పుకుంటున్నారు. స్టార్ హీరో సినిమా రేంజ్ లో వస్తున్న దసరా వసూళ్లు చూసి అందరు షాక్ అవుతున్నారు. ఇదిలా ఉంటే ఈ సినిమా విషయంలో ప్రస్తుతానికి నాని సూపర్ హ్యాపీగా ఉన్నా ఇక మీదట అసలు సినిమా మొదలవుతుందని చెప్పొచ్చు. నాని దసరాతో తన రేంజ్ పెంచుకున్నాడు. ఫస్ట్ డే 35 కోట్ల పైన గ్రాస్ అంటే అది పెద్ద అచీవ్ మెంట్. అయితే నాని రాబోయే సినిమాలకు కూడా ఈ రేంజ్ ఓపెనింగ్స్ ఉంటాయా. నాని ఈ క్రేజ్ ని తన తర్వాత సినిమాలకు కొనసాగిస్తాడా అన్నది డౌట్. ఒక్క సినిమా హీరో ఫేట్ మార్చేస్తుంది. దసరా చూసిన తర్వాత నాని ని ఇన్నాళ్లు మనమే తక్కువ అంచనా వేశాం అనుకున్నారు. అయితే దసరా తర్వాత సినిమాలు కూడా నాని దసరాని మించే రేంజ్ లో తీయాలి ఏమాత్రం తేడా కొట్టినా మళ్లీ దెబ్బ పడటం ఖాయం. అందుకే దసరా హిట్ నానికి హిట్టు కిక్ ఇచ్చినా నెక్స్ట్ సినిమాల మీద మరింత బాధ్యత పెరిగేలా చేసిందని చెప్పొచ్చు. మరీ ముఖ్యంగా అతను రెగ్యులర్ గా చేస్తున్న సినిమాలు చేస్తే మాత్రం మళ్లీ కెరీర్ గ్రాఫ్ పడిపోయే ఛాన్స్ ఉంది. దసరా తర్వాత అంతకు మించి అనిపించే సినిమాలు చేయాల్సి ఉంటుంది. సో దసరా నానికి హిట్ తెచ్చిపెట్టడమే కాకుండా నెక్స్ట్ సినిమాల విషయంలో ఒక అలర్ట్ చేసిందని చెప్పొచ్చు. ఇక దసరా వసూళ్ల విషయానికి వస్తే పోటీగా ఏ సినిమా లేకపోవడం తో పాటుగా అంతటా పాజిటివ్ టాక్ రావడం వీకెండ్ దసరా వసూళ్ల మోత మోగించడం పక్కా అని తెలుస్తుంది. నాని కెరీర్ లో దసరా బిగ్గెస్ట్ హిట్ గా నిలుస్తుందని చెప్పొచ్చు. సినిమాతో డైరెక్టర్ శ్రీకాంత్ ఓదెలకి కూడా మంచి పేరు వచ్చింది.

# ధోనికి సరైన వారసుడు.. అతడికి ఎందుకు అవకాశాలు ఇవ్వడం లేదో!: సెహ్వాగ్

"అతడు కేవలం ఫిఫ్టీలు కొట్టడమే కాదు.. వాటిని సెంచరీలుగా మలచడంలోనూ సఫలమయ్యే సత్తా కలిగిన వాడు. అందుకే మిగతా వారితో పోలిస్తే మరింత ప్రత్యేకంగా కనిపిస్తాడు. గత రెండు సీజన్లలో సీఎస్కే తరఫున పరుగుల వరద పారించాడు. శతకం కూడా బాదాడు. కానీ ఎందుకో టీమిండియాలో అతడి పెద్దగా అవకాశాలు లభించలేదు. జట్టులో సుస్థిరమైన చోటు కోసం ఇంకా ఎదురుచూడాల్సి వస్తోంది. ఒకవేళ ఈ సీజన్‌లో బాగా ఆడితే అయినా మరోసారి భారత జట్టులో తన పేరు చూస్తామేమో!" అని టీమిండియా మాజీ ఓపెనర్ వీరేంద్ర సెహ్వాగ్ అన్నాడు. చెన్నై సూపర్ కింగ్స్ ఓపెనర్ రుతురాజ్ గైక్వాడ్‌ను ఉద్దేశించి ఈ వ్యాఖ్యలు చేసిన వీరూ భాయ్.. అతడికి టీమిండియాలో మరిన్ని అవకాశాలు ఇవ్వాల్సిందని అభిప్రాయపడ్డాడు. అదే విధంగా.. సీఎస్కే సారథిగా మహేంద్ర సింగ్ ధోనికి అతడే సరైన వారసుడు అనిపిస్తున్నాడంటూ.. రుతు నైపుణ్యాలను కొనియాడాడు. కాగా 2021 ఐపీఎల్ సీజన్లో రుతురాజ్ చెన్నై తరఫున 16 ఇన్నింగ్స్‌లో 635 పరుగులు సాధించాడు. ఆ సీజన్‌లో రుతు అత్యధిక స్కోరు 101 నాటౌట్. ఆరెంజ్ క్యాప్ హోల్డర్ కూడా! 2022లో మాత్రం 14 ఇన్నింగ్స్‌లో 368 పరుగులు చేసిన ఈ ముంబై కెప్టెన్.. తాజా సీజన్‌ను ఘనంగా ఆరంభించాడు.. ఇప్పటి వరకు అత్యధిక పరుగుల వీరుల జాబితాలో ముందంజలో ఉన్నాడు. ఇక ఐపీఎల్‌తో పాటు దేశవాళీ క్రికెట్‌లో దంచికొట్టే రుతురాజ్ 2021లో శ్రీలంకతో టీ20 మ్యాచ్‌తో అంతర్జాతీయ క్రికెట్‌లో అడుగుపెట్టాడు. ఆ మరుసటి ఏడాది సౌతాఫ్రికాతో స్వదేశంలో సిరీస్ సందర్భంగా వన్డేల్లోనూ అరంగేట్రం చేశాడు. దేశవాళీ క్రికెట్‌లో ముంబై సారథిగా వ్యవహరిస్తున్న ఈ యువ ఓపెనర్.. ఇప్పటి వరకు అంతర్జాతీయ కెరీర్‌లో 9 టీ20లు(135 పరుగులు), ఒక వన్డే(19 పరుగులు) మాత్రమే ఆడాడు. శుబ్‌మన్ గిల్, ఇషాన్ కిషన్‌ల రూపంలో పోటీ ఎదుర్కొంటున్న 26 ఏళ్ల రుతుకు టీమిండియాలో ఎక్కువగా అవకాశాలు రావడం లేదు.

# సల్మాన్ సినిమా తెలుగులో భారీ రిలీజ్ ప్లాన్..!

బాలీవుడ్ యాక్షన్ స్టార్ సల్మాన్ ఖాన్ సడెన్ గా తెలుగు పరిశ్రమ మీద ఫోకస్ పెట్టాడు. ఇప్పటికే మెగాస్టార్ చిరంజీవి గాడ్ ఫాదర్ సినిమాలో ఒక చిన్న పాత్ర చేసిన ఆయన లేటెస్ట్ గా తను చేస్తున్న కిసి కా భాయ్ కిసి కి జాన్ సినిమాను తెలుగులో రిలీజ్ ప్లాన్ చేస్తున్నారు. ఈ సినిమాలో విక్టరీ వెంకటేష్ కూడా నటించడంతో బాలీవుడ్ లోనే కాదు టాలీవుడ్ లో కూడా ఈ సినిమాపై సూపర్ క్రేజ్ ఏర్పడింది. ఇప్పుడు ఆ క్రేజ్ ని క్యాష్ చేసుకోవాలని చూస్తున్నారు సల్మాన్ సినిమా మేకర్స్. కిసి కి భాయ్ కిసి కా జాన్ సినిమా తెలుగు ఆడియన్స్ కి చూపించాలని ఫిక్స్ అయ్యారు. సినిమాలో వెంకటేష్ చెల్లిగా పూజా హెగ్దే నటిస్తుంది. అంతేకాదు బతుకమ్మ సాంగ్ కూడా పెట్టారంటే సినిమాను తెలుగు ఆడియన్స్ కి ఎంతగా రీచ్ అవ్వాలని చూస్తున్నారో అర్థం చేసుకోవచ్చు. ఏప్రిల్ 21న రిలీజ్ కాబోతున్న ఈ సినిమా తెలుగులో కూడా భారీ రేంజ్ లో రిలీజ్ ప్లాన్ చేస్తున్నారట. డైరెక్ట్ వెంకటేష్ సినిమా రేంజ్ లో సల్మాన్ సినిమాను ప్రమోట్ చేయాలని చూస్తున్నారు. ఎలాగు తెలుగు వర్షన్ వస్తే మన ఆడియన్స్ ఆసక్తి చూపిస్తారు కాబట్టి కిసి కి భాయ్ కిసి కా జాన్ సినిమాను తెలుగులో భారీ స్థాయిలో రిలీజ్ ఫిక్స్ చేశారట. తెలుగులో బిజినెస్ కూడా బాగానే జరిగినట్టు తెలుస్తుంది. తెలుగు ఆడియన్స్ కు సమ్మర్ ట్రీట్ ఇచ్చేందుకు వెంకటేష్ తో కలిసి వస్తున్నారు సల్మాన్ ఖాన్. ఈ సినిమాలో సర్ ప్రైజ్ గా చరణ్ కూడా కనిపిస్తాడని అంటున్నారు.



EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY **AVULA VIJAYA BHASKARA REDDY** PRINTED AT **SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2, OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL - 518 001. ANDHRA PRADESH.**
**PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY, 7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190**